# Navdha-Bhakti-Telugu

॥ శ్రీహరిః ॥

# విషయసూచిక


| విషయం | | ఫుట సంఖ్య |
|---|---|---|
| 1. నవవిధభక్తి రీతులు | ... | 1 |
| 2. శ్రవణం | ... | 6 |
| 3. కీర్తనం | ... | 11 |
| 4. స్మరణం | ... | 18 |
| 5. పాదసేవనం | ... | 26 |
| 6. అర్చనం | ... | 33 |
| 7. వందనం | ... | 36 |
| 8. దాస్యం | ... | 40 |
| 9. సఖ్యం | ... | 45 |
| 10. ఆత్మనివేదనం | ... | 50 |
| 11. ఉపసంహారం | ... | 55 |


* * *

॥ ఓం శ్రీ పరమాత్మనే నమః ॥

# నవవిధ భక్తి రీతులు

'**భక్తి**' సర్వమానవులు సౌలభ్యంతో ఆచరించ దగిన ఒక సాధనం. దీనిపై మనుష్యులందరికీ అధికారం ఉంది. ఈ కలికాలంలో భక్తితో సమానమైన ఆత్మోద్ధారకమగు సులభోపాయమే లేదు. ఏలయన, జ్ఞానం, యోగం, తపం, యాగం వంటివి ఈ కాలంలో లభించటం మిక్కిలి దుస్సాధ్యం. పైగా ఈ రోజుల్లో వాటికి ఉపయోగపడే సాధన సామాగ్రి లభించడం కూడా చాలా కష్టం. అందువల్ల మానవులు నడుం బిగించి సర్వసన్నద్ధులై ఈశ్వరుని యెడల భక్తి కలిగి ఉండటమనెడు సాధన చేయడానికి తత్పరులు కావాలి. కావున లోకములో ధర్మాన్ని గౌరవించే వాళ్ళల్లో ఎక్కువమంది భగవద్భక్తినే యిష్టపడతారని చెప్పవచ్చును. ఇప్పుడు మనం భగవంతుడంటే ఏమిటి? భగవద్భక్తి అంటే ఏమిటి? అనే విషయాన్ని పరిశీలిద్దాం! అందరినీ శాసించేవాడు, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సర్వాంతర్యామి, ధర్మము (న్యాయం), సదాచారమూ తన చట్టముగా కలవాడు, సర్వ సాక్షి భూతుడు, సర్వులకు విద్యాప్రదాత, బుద్ధి దాత, జ్ఞాన ప్రదాత, త్రిగుణాతీతుడయ్యును లీలామాత్రం చేత గుణభోక్త, భక్తులను సకల దుర్గుణ దురాచారాలనుండి, దుఃఖాలనుండి విముక్తులను చేసి పరమ పవిత్రులను చేసేవాడు, అవ్యక్తుడయ్యునూ, ప్రాణుల యెడ దయగలిగి జీవుల సంక్షేమానికి, ధర్మప్రచారానికి, భక్తులకు ఆశ్రయమివ్వడానికి తన లీలలతో అప్పుడప్పుడు దేవమానవాది రూపాలలో వ్యక్త మయ్యేవాడు అంటే సాకార రూపముతో ఆవిర్భవించేవాడు, భక్తకోటికి వారి ఇచ్ఛానుసారము దర్శనమిచ్చి అహ్లాదపరిచేవాడు, సత్యయుగంలో శ్రీహరి రూపంలో, త్రేతాయుగంలో శ్రీరామావతారంగా, ద్వాపరయుగంలో శ్రీకృష్ణావతారంగా అవతరించినవాడు ప్రేమమయమూర్తి, నిత్యుడు, అవినాశి, విజ్ఞానా

నందఘనుడు సర్వవ్యాపి అయిన ఆ విష్ణుమూర్తినే (హరినే) భగవంతునిగా మనం అవగతం చేసుకోవాలి.

ఇప్పుడు మనం 'భక్తి' అంటే ఏమిటో విచారిద్దాం. శాండిల్య మహర్షి ఇలా అన్నాడు – **"సా పరానురక్తిరీశ్వరే"** "పరమేశ్వరుని యందు పరమానురాగం – అంటే పరమ ప్రేమయే భక్తి"

దేవర్షి నారదుడు కూడా తన భక్తి సూత్రాలలో ఇలా పేర్కొన్నాడు. **"సా త్వస్మిన్ పరమప్రేమ రూపా"** ॥2॥ "ఆ పరమేశ్వరుని యందు అతిశయించిన ప్రేమ స్వరూపమే భక్తి" **"అమృతస్వరూపా చ"** ॥3॥– "అది ఇంకా శాశ్వతమైన అమృత స్వరూపం కూడా."

ఈ విధంగా ఇంకా అనేక మహితోక్తులు మనకు లభిస్తాయి. భగవంతుని పై గల అపారమైన ప్రేమయే, శాశ్వతమైన (అమృతమైన) అసలైన భక్తిగా ఈ మహితోక్తుల ద్వారా మనకు బోధపడుతుంది. వ్యాకరణ దృష్టితో చూసినా "భక్తి" శబ్దానికి అర్థం "సేవ" అవుతుంది; ఎందుకంటే 'భక్తి' శబ్దం **"భజ సేవాయామ్"** అనే ధాతువునుండి ఏర్పడుతుంది గనుక అలా అనటం సముచితమే అవుతుంది. ప్రేమ సేవయొక్క ఫలం. అది భక్తి సాధనలకు అంతిమసీమ. వృక్షానికి పరిపూర్ణత్వం, గౌరవం, దానికి ఫలాలు సమకూరినప్పుడే సిద్ధిస్తుంది అలాగే భక్తికి కూడా పరిపూర్ణత్వం, గౌరవం భగవంతుని పై అపారమైన ప్రేమ కలిగి ఉన్నప్పుడే సిద్ధిస్తుంది. ప్రేమయేదానికి పరాకాష్ఠ. ఈ ప్రేమ కోసమే సేవ చేయబడుతోంది. కాబట్టి వాస్తవానికి భగవంతుని పై అనన్యప్రేమ కల్గి ఉండటమే భక్తి.

హనుమంతుడు, జాంబవంతుడు, గజేంద్రుడు, గరుడుడు, కాకభుశుండుడు, జటాయువు వంటి పశు పక్షి కిన్నరాదులు కూడా భగవద్భక్తి ప్రభావంచేత పరమపదాన్ని పొందారు. అయినప్పటికి మానవేతరములైన పశుపక్ష్యాదుల్లో జ్ఞాన సాధనల లోపం వల్ల అవి భగవద్భక్తిని కలిగి ఉండలేక పోతున్నాయి – అందువల్ల భగవంతుని యెడల భక్తి విషయంలో సర్వప్రాణులకు అధికారం ఉండాలన్నది న్యాయ సమ్మతమైనప్పటికి భగవద్భక్తి విషయంలో మనుష్యులకే అధికారాన్ని పేర్కొన్నారు.

భగవద్భక్తి విషయంలో వయస్సు, రూపమువంటి యోగ్యతలతో పనిలేదు. అలాగే విద్య, ధనం, జాతి, శక్తి ఇవేవీ ప్రధానం కావు సరిగదా! సదాచారం సద్గుణాల మీదకూడా భగవంతుడు అంతగా దృష్టి సారించడు. భక్తులలో ప్రేమనే ఆయన దర్శిస్తాడు. ఒక కవికూడా ఇలా పేర్కొన్నాడు.

**వ్యాధస్యా చరణం ధ్రువస్య చ వయో విద్యా గజేంద్రస్య కా**
**కా జాతిర్విదురస్య యాదవపతేరుగ్రస్య కిం పౌరుషమ్।**
**కుబ్జాయాః కమనీయ రూపమధికం కిం తత్సుదామ్నోధనం**
**భక్త్యా తుష్యతి కేవలం న చ గుణైర్భక్తిప్రియో మాధవః॥**

"వ్యాధుడికి ఏపాటి (ఉత్తమ) ఆచరణ ఉండేది? ధ్రువుడి వయస్సెంత? గజేంద్రుడి దగ్గర ఏపాటి విద్య ఉన్నది? విదురుడు ఏ ఉత్తమజాతివాడు? యాదవపతి ఉగ్రసేనుడికి ఏ పురుషార్థం ఉన్నది? కుబ్జ (కంసుని గూనిదాసి)కు ఏమైనా విశేష సౌందర్య రూపం ఉండేదా? కుచేలుడి అటుకులేమిటి? భక్తి ప్రియుడైన మాధవుడు కేవలం భక్తితోనే సంతుష్టుడవుతాడు, కాని గుణాలతో కాదు"

సదాచారాలు, సద్గుణాలు ఆ భక్తులలో భక్తి యొక్క ప్రభావం చేత అనాయాసంగానే వచ్చి చేరతాయి. అందువల్లే భగవద్భక్తిలో సదాచార సద్గుణాలకు అంతగా ప్రాధాన్యం లేదు. అంతమాత్రం చేత భగవద్భక్తి విషయంలో సదాచారసద్గుణాల అగత్యమే లేదని తలంచకూడదు. జబ్బు పడ్డమనిషికి రోగనివృత్తి కోసం ఔషధసేవనం దానితోపాటు పథ్యం ప్రధానమైనట్లే, జనన మరణ రూపమైన భవరోగనివృత్తికి భగవద్భక్తి పరమౌషధమైతే సద్గుణసదాచార సేవనం పథ్యమౌతుంది. లౌకిక రోగనివృత్తికి రోగి ఔషధాన్ని సేవిస్తూనే ఒక వేళ – పథ్యం మీద దృష్టి పెట్టకపోతే అతని రోగనివృత్తి సాధారణంగా జరగదేమో గాని సదాచార సద్గుణ రూపమైన పథ్యానికి లోపం జరిగినప్పటికీ, భక్తి రూపమైన ఔషధాల సేవతో భవరోగనివృత్తి జరుగుతుంది. ఎందుచేతనంటే భక్తి రూపమైన ఔషధం పథ్యం చేసే పనికూడా చేస్తుంది. అంతేకాకుండా

ఈ భక్తి హాని కలిగించే ఆహారమును (కుపథ్యం) స్వీకరించడం వల్ల కలిగే నానావిధ దుర్గుణాలను, విఘ్నరూపమైన దోషాలను నాశనం చేస్తుంది. అంతేగాక శాశ్వతంగా రోగమూలాన్ని కూడా పెకలించి వేస్తుంది. కనుకనే భగవద్భక్తి పరమౌషధం.

భక్తి ముఖ్యంగా రెండు విధాలు - ఒకటి సాధన రూపమైనది. దీనినే వైధ భక్తి అని, నవధాభక్తి (నవవిధభక్తి) అని కూడా పిలుస్తారు. రెండవది సాధ్యరూపమైనది. దీనినే ప్రేమ-ప్రేమలక్షణ మొదలైన పేర్లతో పిలుస్తారు. వీటిలో నవధాభక్తి సాధనరూపమైనది; ప్రేమలక్షణ భక్తి సాధ్యరూపమైనది.

ఇప్పుడు మనం వైధభక్తి అంటే ఏమిటో పరిశీలిద్దాం! దీనికి సంబంధించి ఈ విధంగా చెప్పబడింది - స్వామి (భగవంతుడు) ఏ విధంగా సంతుష్టుడవుతాడో, ఆ విధమైన భావనతో భావించుకొని ఆయన ఆజ్ఞానుసారము వర్తించే పద్ధతినే వైధభక్తిగా పేర్కొనవచ్చు. శాస్త్రాలలో దీనికి సంబంధించి అనేక విధాలయిన లక్షణాలు పేర్కొనబడ్డాయి.

తులసీదాసు రచించిన రామాయణంలో శ్రీరామచంద్రుడు శబరితో ఇలా అంటాడు -

**ప్రథమ భగతి సంతన్హ కరసంగా। దూసరి రతి మమ కథా ప్రసంగా॥**

**గురపద పంకజ సేవా తీసరి భగతి అమాన్।**
**చౌథి భగతి మమ గునగన కరఇ కపట తజి గాన్॥**
**మంత్ర జాప మమ దృఢ బిస్వాసా। పంచమ భజన సో బేద ప్రకాసా॥**
**ఛఠ దమసీల బిరతి బహు కరమా। నిరత నిరంతర సజ్జన ధరమా॥**
**సాతవఁ సమ మోహి మయ జగ దేఖా। మోతేఁ సంత్ అధిక్ కరిలేఖా॥**
**ఆఠవఁ జథాలాభ్ సంతోషా। సపనేహుఁ నహిఁ దేఖయి పరదోషా॥**
**నవమ సరల సబసన్ ఛలహీనా। మమ భరోస హియఁ హర్ష నదీనా॥**

అంటే - మొదటిది సత్సంగతిని కలిగియుండుట. రెండవది నా లీలలను వినుటలో ఆసక్తి గలిగియుండుట, మూడవది గురువు యొక్క

పాదపద్మాలను కపటము లేకుండా సేవించుట, నాల్గవది నా గుణాలను డాంబికం లేకుండా గానము చేయుట, ఐదవది నా నామరూపమైన మంత్రాన్ని జపించడంలో పూర్తి విశ్వాసాన్ని కలిగియుండుట, దీనినే వేదాలు వర్ణించాయి కూడా, ఆరవది ఇంద్రియనిగ్రహము, సత్ప్రవర్తన, ప్రాపంచికమైన విషయాలన్నిటిపై వైరాగ్యాన్ని కలిగియుండుట, సజ్జనుల పరమార్థసాధనపై ఎల్లప్పుడూ మనసునిలుపుట, ఏడవది ప్రపంచమంతా నేను వ్యాపించివున్నట్లు భావించుట, భగవద్భక్తులను నాకంటే ఎక్కువగా గౌరవించుట, ఎనిమిదవది అనుకోకుండా లభించిన దానితో సంతోషించుట, కలలో కూడా ఇతరుల తప్పులను చూడకపోవుట, తొమ్మిదవది కపటము లేకుండా అందరితో వినయంగా ప్రవర్తించుట, నాపై విశ్వాసమునుంచి, అనుకూలమైనది కలిగినపుడు సంతోషమును గానీ, ప్రతికూలమైనది కలిగినప్పుడు దైన్యాన్ని కానీ పొందకుండుట.

అలాగే శ్రీమద్భాగవతంలో కూడా ప్రహ్లాదుడిలా అంటాడు –

**శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్।**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్॥** (7:5:23)

"విష్ణుభగవానుని నామ, రూప, గుణ, ప్రభావాదులను గురించి శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, ఇంకా భగవంతుని యెడల దాస్యభావం, సఖ్యభావం, ఆత్మసమర్పణం – ఇదే తొమ్మిది విధాలయిన భక్తిస్వరూపం."

ఈ విధంగా శాస్త్రాలలో భక్తిని గురించి బహువిధాలుగా లక్షణాలను పేర్కొన్నప్పటికి కొంత విచారించి చూచినట్లయితే సిద్ధాంతంలో ఏ విధమైన భేదమూ కనబడదు. ఏ భావనతో, ఏ ఆచరణతో స్వామి సంతుష్టుడవుతాడో, అలా భావనచేసి ఆయన ఆజ్ఞానుసారం ఆచరించడమే సేవ అనగా భక్తి – అదే అన్నింటా ఏక సూత్రంగా ఉంటుంది.

ఇప్పుడు మనం శ్రీమద్భాగవతంలో ప్రహ్లాదుని ద్వారా చెప్పబడిన నవవిధ భక్తుల విషయంలో వాటి స్వరూపం, విధి, ప్రయోజనం, హేతువు,

ఫలం, దృష్టాంతాలకు సంబంధించిన దిగ్దర్శనం చేద్దాం! పైన చెప్పిన నవవిధ భక్తులలో ఏ ఒక్కదానిని ఉత్తమ పద్ధతిలో అనుష్ఠించినా మానవునకు పరమపదప్రాప్తి కలుగుతుంది. మరలాంటప్పుడు తొమ్మిది విధాలయిన భక్తులను అనుష్ఠించే మానవునకు కలిగే శుభాలను గురించి చెప్పేదేముంది?

# శ్రవణం

భగవంతుని యెడల ప్రేమికులైన భక్తుల ద్వారా చెప్పబడిన పరమాత్ముని నామ, రూప, గుణ, ప్రభావ, లీలా, తత్త్వ రహస్యాలకు సంబంధించిన అమృతమయ కథలను శ్రద్ధాపూర్వకంగా, ప్రేమ పూర్వకంగా వినడం, అమృతమయ గాథలను వింటూ వీణాగానాన్ని వింటూ ముగ్ధురాలయ్యే జింకలాగా ఆ ప్రేమలో ముగ్ధులవటం శ్రవణభక్తి స్వరూపంగా పేర్కొనవచ్చు.

పైన చెప్పిన శ్రవణభక్తిని పొందటానికి శ్రద్ధాపూర్వకంగా, ప్రేమ పూర్వకంగా మహా పురుషులకు సాష్టాంగ వందనం చేయడం, వారికి తగిన పరిచర్య (సేవ) చేయడం, వారితో నిత్యం కపటం లేకుండా ప్రశ్నలడుగుతూ సందేహ నివృత్తి చేసుకోవడం, వారు చెప్పిన మార్గానుసారంగా ఆచరణలో పెట్టడానికి తత్పరులై ప్రయత్నించడం అనేవి శ్రవణభక్తిని పొందటానికి కావలసిన నియమాలు. శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్ముడు ఇలా పేర్కొన్నాడు–

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా।**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః॥** (4:34)

"ఓ అర్జునా! శ్రోత్రియులు, బ్రహ్మనిష్ఠులు అయిన ఆచార్యుల కడకు వెళ్ళి వారికి చక్కగా సాష్టాంగ దండప్రణామాలాచరించి, సేవించి మనస్సులో కపటాన్ని వదలి సరళ బుద్ధితో ప్రశ్నించినచో పరమతత్త్వాన్ని చక్కగా తెలిసికొనిన ఆ మహాత్ములు నీకా తత్త్వజ్ఞానాన్ని ఉపదేశిస్తారు. నీవా జ్ఞానాన్ని బాగా తెలుసుకో!"

మహాపురుషుల ద్వారా వర్ణితమైన ఆ శ్రవణభక్తిని పొంది ప్రభువునందు అనన్యప్రేమ కలిగి ఉండటం కోసం భక్తులలో ప్రచారం చేయడమే ఈ భక్తి యొక్క ప్రయోజనం.

మహాపురుషుల సాంగత్యం లేకుండా ఈ శ్రవణభక్తిని సాధించటం చాలా కష్టం. గోస్వామి తులసీదాసుకూడా ఈ విధంగా పేర్కొన్నారు:

**బిను సత్సంగ్ న హరికథా తేహి బిను మోహ న భాగ్।**
**మోహ గయేఁ బిను రామ్ పద్ హోఇ న దృఢఅనురాగ్॥**

అంటే 'సత్పురుషులతో కలవనిదే భగవంతుని కథలు లభించవు, ఆ కథలు లభించనిదే మోహము నశించదు, మోహము నశించనిదే భగవంతుని పాదకమలాలపై స్థిరమైన అనురాగమేర్పడదు. కాబట్టి, శ్రేయస్సు ప్రాప్తించడానికి సత్పురుషుల కలయిక మొదటి మెట్టు.'

అయితే మహాపురుషుల సాంగత్యం లభించనప్పుడు ఉన్నత శ్రేణికి చెందిన సాధకుల సాంగత్యం చేయడం గాని, మహాపురుషులు రచించిన గ్రంథావలోకనం చేయడం గాని సత్సాంగత్యంతో సమానమైనవే!

సత్సంగతి సాధ్యం కానప్పుడు విషయసాంగత్యం సహజంగానే ఏర్పడుతుంది. దానితో మానవుని పతనం కూడా సంభవిస్తుంది. సత్సాంగత్యం వల్ల ప్రత్యక్షంగానే పరమ ప్రయోజనం సిద్ధిస్తుంది. ఎందుకంటే మనిషికి ఎలాంటి సాంగత్యముంటుందో, ఆ సాంగత్యాన్ని బట్టి అలాంటి ప్రభావం అతని మీద పడుతుంది. పైగా సత్సాంగత్యమే శ్రవణభక్తికి హేతువు కాబట్టి శ్రవణభక్తి సత్సంగం వల్లనే సిద్ధిస్తుంది. అందుకే సత్పురుషుల దర్శనం, భాషణం, స్పర్శనం, చింతనం, సత్సంగం మొదలైన వాటివల్ల పాపాత్ములు కూడా పరమ పవిత్రులుగా తయారువుతారు. మహాపురుషుల కృప లేకుండా ఎవరు కూడా పరమపదప్రాప్తిని పొందలేరు.

శ్రీ మద్భాగవతంలో మహాత్ముడైన జడభరతుడు రహూగణ మహారాజుతో ఈ విధంగా అంటాడు–

**రహూగణైతత్తపసా న యాతి**
**న చేజ్యయా నిర్వపణాద్ గృహాద్వా।**
**న చ్ఛందసా నైవ జలాగ్ని సూర్యై-**
**ర్వినా మహత్పాదరజోఽభిషేకమ్॥** (5:12:12)

"ఓ రహూగణా! మహాపురుషుల చరణధూళిలో స్నానమాడకుండా కేవలం తపం, యజ్ఞం, దానం, గార్హస్థ్యధర్మ పాలనం, వేదాధ్యయనం, ఇంకా జలాగ్నిసూర్యోపాసన లెన్ని చేసినా ఆ పరమ తత్త్వజ్ఞానం సిద్ధించదు."

కాబట్టి సర్వకార్యసిద్ధి మహాపురుషుల సాంగత్యం వల్లనే సాధ్యపడుతుందని దీనివల్ల మనకు స్పష్టమవుతోంది. శ్రీమద్భాగవతంలో పరమాత్ముడు ఉద్ధవుడితో ఇలా అంటాడు-

**యథోపశ్రయమాణస్య భగవంతం విభావసుమ్।**
**శీతం భయం తమోఽప్యేతి సాధూన్ సంసేవతస్తథా॥**
**అన్నం హి ప్రాణినాం ప్రాణా ఆర్తానాం శరణం త్వహమ్।**
**ధర్మో విత్తం నృణాం ప్రేత్య సంతోఽర్వాగ్ బిభ్యతోఽరణమ్॥**
(11:26:31,33)

"ఓ ఉద్ధవా! అగ్నిదేవుని ఆశ్రయాన్ని పొంది చలి, భయము, చీకటి మొదలైనవి నాశనమైనట్లే సజ్జనులైన మహాపురుషుల సాంగత్యం వల్ల పాపరూపమైన చలి, జనన మరణ రూపమైన భయం, అజ్ఞాన రూపమైన చీకటి నాశనమవుతాయి."

"ప్రాణులకు అన్నం జీవనమైనట్లే దుఃఖితులైన మానవులకు నేను ఆశ్రయమైయున్నాను. అలాగే మానవుల మరణానంతరమూ ధర్మమే ధనమైనట్లు జననమరణాలతో భయభీతులై వ్యాకుల చిత్తులైన మానవులకు సజ్జనులైన మహాపురుషులే పరమాశ్రయమైయున్నారు"-

**న రోధయతి మాం యోగో న సాంఖ్యం ధర్మ ఏవ చ।**
**న స్వాధ్యాయస్తపస్త్యాగో నేష్టాపూర్తం న దక్షిణా॥**
**వ్రతాని యజ్ఞశ్ఛందాంసి తీర్థాని నియమా యమాః।**
**యథావరుంధే సత్సంగః సర్వసంగాపహో హి మామ్॥** (11:12:1-2)

"సకల అపేక్షలను నాశనం చేయగల సత్సాంగత్యము నాకు అవరోధాన్ని కలిగించినట్లుగా అనగా ప్రేమపాశంతో బంధించ గలిగినట్లుగా యోగం, సాంఖ్యం, ధర్మపాలనం, స్వాధ్యాయం, తపం, త్యాగం, యజ్ఞం, తటాకాది - నిర్మాణం దానము, వ్రతము, పూజ, వేదాధ్యయనము, తీర్థాటనము, యమనియమముల పాలనము ఇవేమీ కూడా నన్ను బంధించజాలవు. అనగా, వీటిద్వారా నేను వశుడను కాజాలను"

మహాపురుషుల సాంగత్యం దుర్లభం, అగమ్యం; అమోఘం. కాబట్టి భగవత్ప్రాప్తిని కోరే పురుషులకు సత్సాంగత్యం అత్యంతావశ్యకం. దేవర్షి నారదుడు కూడా ఇలా అంటాడు-

**'మహత్సంగస్తు దుర్లభోఽగమ్యోఽమోఘశ్చ'** (నా.సూత్ర: 39)

'మహాపురుషుల సాంగత్యం దుర్లభమైనది, అగమ్యం (అంతు తెలియనిది), అమోఘం.'

కాబట్టి -

**'తదేవ సాధ్యతామ్, తదేవ సాధ్యతామ్।'** (నా. సూత్ర 42)

"ఆ సాంగత్యాన్నే సాధన చెయ్యి - ఆ సాంగత్యాన్నే సాధన చెయ్యి. అంటే సజ్జనులైన మహాపురుషుల సాంగత్యంతో, సేవచేస్తూ వారి ఆజ్ఞలను శిరసావహించు అని భావం."

సత్పురుషుల ద్వారా లభించిన కేవల శ్రవణభక్తితో కూడా మనుష్యులు పరమపదాన్ని పొందగలరు. ఇది ఈ భక్తియొక్క ఫలము.

పరమాత్ముడు శ్రీమద్భగవద్గీతలో ఇలా అన్నాడు -

**అన్యే త్వేవమజానన్తః శ్రుత్వాన్యేభ్య ఉపాసతే।**
**తేఽపి చాతి తరన్త్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః॥** (13:25)

"అనగా - ఇతరులు అంటే మందబుద్ధులైన పురుషులు తెలియనివారై తత్త్వజ్ఞానులైన పురుషులనుండి జ్ఞానోపదేశాన్ని పొంది తదనుగుణంగా ఉపాసన చేస్తారు. ఈ విధంగా శ్రవణ పరాయణులైన పురుషులు కూడా

మృత్యురూపమైన సంసార సాగరాన్ని నిస్సందేహంగా దాటుచున్నారు."

శ్రీమద్భాగవత మాహాత్మ్యంలో నారదుడు, సనకాది మునులతో ఇలా అన్నాడు –

**శ్రవణం సర్వధర్మేభ్యో వరం మన్యే తపోధనాః।**
**వైకుంఠస్థో యతః కృష్ణః శ్రవణాద్ యస్య లభ్యతే॥** (6:77)

"ఓ తపోధనులారా! నేను భగవంతుని గుణగానం చేసే వాళ్ళ శ్రవణభక్తిని సర్వధర్మాలలో శ్రేష్ఠమైనదిగా భావిస్తాను. ఎందుకంటే భగవంతుని గుణగానాన్ని వినడం వల్ల వైకుంఠవాసియైన భగవంతుడు ప్రాప్తిస్తాడు."

కేవలం శ్రవణభక్తి వల్లనే భగవత్ప్రాప్తి సిద్ధిస్తుంది. దీనికి నిరూపణగా శాస్త్రాలలో అనేక ప్రమాణాలు మనకు లభిస్తాయి. అలాగే చరిత్రలో, పురాణాలలో పెక్కు ఉదాహరణలు మనకు కనిపిస్తాయి. ఉదాహరణకు పరీక్షిన్మహారాజు భాగవత శ్రవణం వల్లనే పరమపదప్రాప్తిని పొందాడు. శ్రీమద్భాగవత మాహాత్మ్యంలో ఇలా వ్రాయబడింది –

**అసారే సంసారే విషయ విషసంగాకులధియః**
**క్షణార్థం క్షేమార్థం పిబత శుకగాథాతులసుధామ్॥**
**కిమర్థం వ్యర్థం భో వ్రజత కుపథే కుత్సితకథే**
**పరీక్షిత్సాక్షీ యచ్ఛ్రవణగత ముక్త్యుక్తి కథనే॥** (6:100)

"విషయ రూపమైన విషసంసర్గం వల్ల వ్యాకుల బుద్ధులైన ఓ పురుషులారా! కుత్సిత కథారూపమైన చెడు మార్గంలో ఎందుకలా వ్యర్థంగా తిరుగుతున్నారు? ఈ అపారమైన ప్రపంచంలో సుఖ సౌభాగ్యాల కోసం (కనీసం) అర క్షణమైనా శుకదేవుల ముఖతః వెలువడిన భాగవత కథారూపమైన అనుపమ అమృత పానం చెయ్యండి! శ్రవణభక్తి ద్వారా ముక్తి కలుగుతుంది. ఈ కథనానికి పరీక్షిన్మహారాజు సాక్షీభూతుడై (ప్రమాణమై) యున్నాడు."

ధుంధుకారుని వంటి పాపాత్ములు కూడా భగవంతుని గుణగానాన్ని విని ఆ ప్రభావంచేతనే తరించారు. అలాగే శౌనకాది మహామునులం

దరూ పురాణేతిహాసాల శ్రవణంలోనే తమ కాలాన్ని గడుపుతుండేవారు. వారికెప్పుడూ విసుగూ, అలసట లేదు. అంటే ఎప్పుడూ వింటున్నా కూడా వారికి ఇక చాలు అనేదే లేదు.

ఈ మానవజీవితానికి ఇంతకంటే మించిన ఆనందదాయకమైన వినదగ్గ విషయం మరొకటి ఉండదు. ఇది మహాపురుషుల సాంగత్యం వల్లనే లభిస్తుంది. అందుచేత ఈ ప్రపంచంలో మానవులకు మహాపురుషుల సాంగత్యంతో సమానమైన ఆనంద ప్రదమైన లాభదాయకమైన పదార్థమేదీలేదు. శ్రీమద్భాగవతంలో సూతుడిలా అంటాడు –

**తులయామ లవేనాపి న స్వర్గం నా పునర్భవమ్।**
**భగవత్సంగిసంగస్య మర్త్యానాం కిముతాశిషః॥** (1:18:13)

"భగవత్సంగులు అనగా నిత్యం భగవంతునితో గడిపే అనన్య ప్రేమికులైన భక్తులతో నిమేషమాత్రమైన సాంగత్యంతో మనం స్వర్గమోక్షాలను కూడా సమానం చేసి (పోల్చి) చూడలేము. మరి అలాంటప్పుడు మనుష్యులు కోరుకునే పదార్థాల (వస్తువుల) విషయం వేరే చెప్పాలా?"

అందువల్ల మనం జీవితాంతం మహాపురుషుల సాంగత్యంలోనే ఉంటూ భగవంతుని నామ, రూప, గుణ, ప్రేమ ప్రభావ, లీలా, జన్మతత్త్వ రహస్యాలకు సంబంధించిన అమృతమయగాథల నిరంతర శ్రవణంలోనే గడపాలి. వాటిని వింటూవింటూ ఆ ప్రేమలో ఆనందంలో ముగ్ధులవుతూ మానవ జీవితాన్ని సఫలం చేసుకోవాలి.

# కీర్తనం

భగవంతుని నామ, రూప, గుణ, ప్రభావ, చరిత్ర, తత్త్వ రహస్యాలను శ్రద్ధాపూర్వకంగా, ప్రేమపూర్వకంగా పదే పదే ఉచ్చరిస్తోంటే శరీరం పులకిత మవటం, కంఠం గద్గదమవటం, కళ్ళల్లో ఆనందాశ్రువులొలకడం, హృదయం ప్రఫుల్లితమై ముగ్ధులవటం మొదలైన లక్షణాలతో విలసిల్లటమే "కీర్తన భక్తి" స్వరూపంగా చెప్పవచ్చును.

కథా వ్యాఖ్యానాదుల ద్వారా భక్తులను ముందుగా పెట్టుకొని భగవంతుని యొక్క ప్రేమౌన్నత్యాన్ని గురించి వినిపించటం, ఏకాంతంలో గాని, అందరితో కలిసిగాని భగవత్సముఖాన్ని భావిస్తూ ఆయన నామాన్ని అంతర్జపంగాగాని, ఉపాంశుజపంగాగాని, ఉచ్చైస్స్వరంతో కీర్తన చేయడం, భగవంతుని గుణ, ప్రభావ, చరిత్రాదులను శ్రద్ధాపూర్వకంగా, ప్రేమపూర్వకంగా నెమ్మది నెమ్మదిగా గాని, బిగ్గరగా గాని, నిలచి గాని, కూర్చొనిగాని, వాద్య నృత్యసహితంగా గాని, వాద్య నృత్య రహితంగా గాని ఉచ్చరించడం, దివ్యస్తోత్రాలతో గాని, పదాలతోగాని, భగవంతుని స్తోత్రం చేయడమే పైన చెప్పిన కీర్తనభక్తిని సాధించటానికి చేయవలసిన పద్ధతులు. అయితే ఈ ప్రక్రియలన్ని నామానికి సంబంధించిన దశాపరాధాలను* తొలగించుకుంటూ నిరాడంబరంగా, శ్రద్ధాభావనతో సహజంగా చేయాల్సి ఉంటుంది.

పైన చెప్పిన కీర్తన భక్తిని పొంది భగవంతుని యెడల అందరూ అనన్య ప్రేమికులై ఆయనను పొందాలన్న ఉద్దేశంతో కీర్తన చేయడమే ఈ కీర్తనభక్తి ప్రయోజనం.

కీర్తన భక్తి కూడా పరమాత్మకృపవల్ల, మహాత్ముల దయ వల్లనే లభిస్తుంది. అందువల్ల ఈ విషయంలో వారి కృపయే హేతువు,

---

* సన్నిందాసతి నామవైభవకథా శ్రీశేశయోర్భేదధీ-
రశ్రద్ధా శ్రుతి శాస్త్ర దైశిక గిరాం నామ్న్యర్థవాద భ్రమః।
నామాస్తీతి నిషిద్ధవృత్తి విహితత్యాగో హి ధర్మాంతరైః
సామ్యం నామ్ని జపే శివస్య చ హరేర్నామాపరాధా దశ॥

'సత్పురుషుల్ని నిందించడం, అశ్రద్ధాళువులైన వారి నామ మహిమను వక్కాణించడం, శివకేశవుల యెడల భేదబుద్ధి, వేదాలు, శాస్త్రాలు, గురువచనాలపై అవిశ్వాసం, హరినామ విషయంలో నామస్తుతి మాత్రంగానే అంతంతమాత్రమైన మాన్యతగలిగిన హేతువాదభ్రమ, నామము యొక్క ముసుగులో విహితకర్మలను వదిలి వేయుట మరియు నిషిద్ధ కర్మలను ఆచరించుట, అన్యధర్మాలతో నామమహిమను పోల్చి చూడటం: అనగా శాస్త్రవిహిత ధర్మాలతో నామమహిమను పోల్చి చూడటం, - ఇవన్నీ శివకేశవ నామజపంలో నామ విషయమైన పది అపరాధాలు'.

ఎందుకంటే భగవంతుని భక్తులద్వారా భగవంతుని ప్రేమ, ప్రభావ, తత్త్వ, రహస్యాది విషయాలు వినటం వల్ల, శాస్త్రాలను చదవటం వల్ల భగవంతుని యందు శ్రద్ధకలుగుతుంది. అప్పుడు మానవులు పైన చెప్పిన భక్తిని పొందగలుగుతారు. కాబట్టి భగవంతుడి యొక్క, మరియు భగవద్భక్తులయొక్క దయాప్రాప్తికి వారి ఆజ్ఞను శిరసావహించవలసి ఉంటుంది.

ఈ విధమైన కీర్తన భక్తి తోడనే మానవులు పరమాత్ముని కృపవల్ల, అయన యందు అనన్యప్రేమ కలిగి ఆయనను పొందగలుగుతారు. భగవద్గీతలో పరమాత్ముడు ఇలా అన్నాడు–

**అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్।**
**సాధురేవ స మంతవ్యః సమ్యగ్వ్యవసితో హి సః॥**
**క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి।**
**కౌంతేయ ప్రతి జానీహి న మే భక్తః ప్రణశ్యతి॥** (9:30–31)

"ఎవరైనను పరమదురాచారుడైనను, అనన్యభక్తి భావముతో నా భక్తుడై నన్ను భజించుచున్నచో, అతడు సజ్జనుడుగానే పరిగణించ దగినవాడగుచున్నాడు. ఎందువల్లనంటే వాడు యథార్థ నిశ్చయము కలిగి ఉన్నాడు. అనగా అతడు పరమేశ్వరుని భజనతో సమానమైనది మరొకటి లేదను నిశ్చితాభిప్రాయమును కలిగి యున్నాడు. అందువల్ల అతడు త్వరలోనే ధర్మాత్ముడగును. శాశ్వతమైన పరమశాంతిని పొందును. హే అర్జునా! నీవు సత్యమును నిశ్చయముగా తెలుసుకో! నా భక్తుడెన్నటికీ నశింపడు"

ఇంతేకాదు ఈ కీర్తన భక్తి ప్రచారకుడు కూడా భగవంతునికి అందరికంటే ప్రియమైన వాడవుతాడు. భగవానుడు గీతలో స్వయంగా ఇలా పేర్కొన్నాడు –

**య ఇమం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి।**
**భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః॥**

**న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః।**
**భవితా న చ మే తస్మాత్ అన్యః ప్రియతరో భువి॥** (18:68–69)

"– ఏ పురుషుడైతే నాయందు పరమప్రేమతో పరమ గోప్యమైన ఈ గీతాశాస్త్రాన్ని నా భక్తులకు తెలియజేస్తాడో అనగా నిష్కామభావంతో ప్రేమ పూర్వకంగా నా భక్తులను చదివింపజేస్తాడో, అర్థతాత్పర్యాది వ్యాఖ్యానాదుల ద్వారా దీనిని ప్రచారం చేసి వారి హృదయాలలో అధిష్ఠింప జేస్తాడో, వాడు నన్నే పొందుతాడు. ఈ విషయంలో ఎట్టి సందేహమూలేదు. అట్టి వానిని మించి మిక్కిలి ప్రియకార్యము చేసేవాడు మానవులలో ఉండడు. సరికదా! వానిని మించి నాకు ప్రియమైనవాడు ఈ భూ మండలంలో మరొకడు భవిష్యత్తులో కూడా కలుగబోడు. ఇదే ఈ కీర్తనభక్తి యొక్క ఫలం."

రామాయణ భాగవతాది సర్వభక్తి గ్రంథాలలో భగవంతుని నామగుణ కీర్తనతోనే సకల పాపాలు నశించి భగవత్ప్రాప్తి కలుగుతుందని చెప్పబడింది. శ్రీమద్భాగవతంలో ఇలా చెప్పబడింది –

**బ్రహ్మహా పితృహా గోఘ్నో మాతృహాఽఽచార్యహాఘవాన్।**
**శ్వాదః పుల్కసకో వాపి శుద్ధ్యేరన్ యస్య కీర్తనాత్॥** (6:13:8)

"బ్రాహ్మణ ఘాతకులు, పితృఘాతకులు, గోఘాతకులు, మాతృఘాతకులు, గురుఘాతకులు అయిన పాపాత్ములు, చండాలురు, మ్లేచ్ఛులు సైతం అతని కీర్తన వల్ల పరిశుద్ధులవుతున్నారు."

**సంకీర్త్యమానో భగవాననంతః**
**శ్రుతానుభావో వ్యసనం హి పుంసామ్।**
**ప్రవిశ్య చిత్తం విధునోత్యశేషం**
**యథా తమోఽర్కోఽ భ్రమివాతివాతః॥**

(శ్రీమద్భా: 12:12:47)

"సూర్యుడు అంధకారాన్ని, ప్రచండ వాయువు మేఘాలను ఛిన్నాభిన్నం చేసినట్లుగా విఖ్యాత ప్రాభవవంతుడైన అనంత భగవానుడు కీర్తింపబడినప్పుడు, మనుష్యుల హృదయంలో ప్రవేశించి వారి సకల పాపాలను నిస్సందేహంగా విధ్వంసం చేస్తాడు."

ఇంకా –

**ఆపన్నః సంసృతిం ఘోరాం యన్నామ వివశో గృణన్।**
**తతః సద్యో విముచ్యేత యద్బిభేతి స్వయం భయమ్॥**

(శ్రీమద్భా: 1:1:14)

అనగా 'జన్మ, మరణమనే ఘోరమైన సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్న మానవుడు భగవంతుని నామాన్ని అనుకోకుండ కీర్తించినా వెంటనే ఆ సంసారమునుండి ముక్తిని పొందుతాడు. ఆ భగవంతుని ముందు భయము కూడా స్వయంగా భీతితో అణగిమణిగి వుంటుంది.'

**కలేర్దోషనిధే రాజన్నస్తి హ్యేకో మహాన్ గుణః।**
**కీర్తనాదేవ కృష్ణస్య ముక్తసంగః పరం వ్రజేత్॥** (శ్రీమద్భా: 12:3:51)

"ఓ రాజా! శ్రీకృష్ణభగవానుని కీర్తన వల్లనే మానవులు ఆసక్తి రహితులై పరమాత్మను పొందుతారు. ఇది దోషాలనిధియైన ఈ కలికాలం యొక్క ఒకే ఒక మహాగుణం."

**ఇత్థం హరేర్భగవతో రుచిరావతార**
**వీర్యాణి బాల చరితానిచ శంతమాని।**
**అన్యత్ర చేహ చ శ్రుతాని గృణన్ మనుష్యో**
**భక్తిం పరాం పరమహంసగతౌ లభేత॥** (శ్రీమద్భా: 11:31:28)

"ఈ విధంగా ఈ భాగవతంలో, ఇంకా అన్ని శాస్త్రగ్రంథాలలో వర్ణింపబడిన శ్రీకృష్ణభగవానుని సుందరావతారానికి సంబంధించిన పరాక్రమాలు, సర్వ శుభప్రదములైన బాల్య చరిత్రలను కీర్తించే మానవుడు పరమహంసల గమ్య రూపమైన భగవంతుని యెడల పరాభక్తిని పొందగలడు."

**అహో! బతశ్వపచోఽతో గరీయాన్।**
**యజ్జిహ్వాగ్రే వర్తతే నామ తుభ్యమ్।**
**తేపుస్తపస్తే జుహువుః సస్నురార్యా**
**బ్రహ్మానూచుర్నామ గృణన్తి యే తే॥** (శ్రీమద్భా: 3:33:7)

"అహో! ఆశ్చర్యకరమైన విషయం. ఎవని జిహ్వాగ్రంపై నీ పవిత్రనామం ఉంటుందో ఆతడు చండాలుడైనను, ఉత్తముడే అవుతాడు. ఎందుకంటే ఎవరు నీనామసంకీర్తనం చేస్తారో, అట్టి (శ్రేష్ఠ) పుణ్యపురుషులు తపం, యజ్ఞం, తీర్థస్నానం, వేదాధ్యయనం మొదలైనవన్నీ చేసినట్లే!"

"రామ చరిత మానస్"లో గోస్వామి తులసీదాసు కూడా నామ జపం యొక్క మహిమను గురించి చెప్పాడు

**నాము సప్రేమ జపత అనయాసా। భగత హోహిఁ ముదమంగల బాసా॥**
**నాము జపత ప్రభు కీన్హ ప్రసాదూ। భగత సిరోమని భే ప్రహలాదూ॥**
**సుమిరి పవనసుత పావన నామూ। అపనే బస కరి రాఖే రామూ॥**
**చహుఁ జుగ్ తీని కాల తిహుఁలోకా। భయే నామ జపి జీవ బిసోకా॥**
**కహౌఁ కహాఁ లగి నామ బడాఈ। రాము న సకహిఁ నామగున గాఈ॥**

అనగా "భగవంతుని నామాన్ని ప్రేమతో జపించేవాడు అనాయాసంగా ఆనందానికి, మంగళానికి నివాసమవుతాడు. తన నామాన్ని జపించే ప్రహ్లాదుడిపై భగవంతునికి ఎంత కృప గలిగిందంటే, అతడు భక్తశిరోమణి అయ్యాడు. భగవంతుని నామాన్ని జపిస్తూ వాయుదేవునిగారాలబిడ్డడు ఆంజనేయుడు శ్రీరామచంద్రుని తన హృదయములో నిలుపుకున్నాడు. నాలుగు యుగాలలో, మూడుకాలాలలో మూడులోకాలలో భగవంతుని నామాన్ని జపించినవాడు శోకరహితుడైనాడు. తులసీదాసు గారింకా అంటారు – ఈ నామమహిమను ఏమని చెప్పగలము? స్వయంగా శ్రీరాముడే తన నామమహిమను చెప్పడానికి అసమర్థుడు."

పతంజలి మహర్షి కూడా ఇలా పేర్కొన్నాడు –

**"తస్య వాచకః ప్రణవః"** (యోగ: 1:27)

"ఆ పరమాత్మ వాచకం అనగా నామము ఓంకారము."

**"తజ్జపస్తదర్థభావనమ్"।** (యోగ:1:28)

"ఆ పరమాత్ముని యొక్క నామజపం, దాని అర్థాన్ని భావనచేయడం అనగా స్వరూపాన్ని చింతన చేయడం."

**"తతః ప్రత్యక్చేతనాధిగమోఽప్యంతరాయాభావశ్చ"** (యోగ: 1:29)

పైన పేర్కొన్న సాధనవల్ల సకల విఘ్ననాశనము, పరమాత్మ ప్రాప్తి కూడా సిద్ధిస్తాయి. నారద పురాణంలో కూడా ఇలా చెప్పబడింది -

**హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్।**
**కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా॥** (1:41:115)

"కలియుగంలో కేవలం శ్రీహరినామమే సర్వశుభప్రదమైన సాధనం. ఇది తప్ప మరో ఉపాయమే లేదు." ఈ విధంగా శాస్త్రాల్లో ఇంకా ఎన్నో ప్రమాణాలు మనకు లభిస్తాయి.

పూర్వకాలంలో అనేకమంది భక్తులు ఈ కీర్తన భక్తి వల్ల తరించారు. పురాణేతి హాసాల్లో, రామాయణంలో అనేక దృష్టాంతాలు కూడా మనకు లభిస్తాయి.

భగవంతుని నామ, గుణ, కీర్తన ప్రభావం వల్ల పూర్వకాలంలో నారదుడు, వాల్మీకి, శుకదేవుడు మొదలైనవారు ఇంకా ఈ కాలంలో గౌరాంగ్ మహాప్రభు, తులసీదాసు, సూరదాసు, నానక్, తుకారామ్, నరసీ, మీరాబాయి ఇత్యాది అనేక భక్తులు పరమపదాన్ని పొందియున్నారు. వీరి జీవితచరిత్రలు ఇతి ప్రసిద్ధములే గదా! పరమభక్తుల విషయం అలా ఉంచండి; మహాపాపాత్ములు సైతం మోక్షాన్ని పొందిన సంఘటనలున్నాయి. గోస్వామి శ్రీ తులసీదాసు ఇలా పేర్కొన్నాడు.

**అపతు అజామిలు గజు గనికావూ, భయే ముకుత హరి నామ ప్రభావూ॥**

అనగా - ఇంకేమని చెప్పగలము? " పతితుడగు అజామిళుడు, గజేంద్రుడు, గణికావేశ్య వీరందరు ఆ హరి నామ ప్రభావం చేతనే ముక్తి నొందినారుకదా!"

కాబట్టి వానకోయిల (చాతకపక్షి) మేఘాలను చూసి నీళ్ళకోసం "పీపీ" స్వరం చేసినట్లు భగవానుని యెడల పరమప్రేమ కలగటానికి, ఆ పరమాత్మను పొందటానికి, భగవంతుని నామ, గుణ, కీర్తనలో నిత్యనిరంతర తత్పరులై ప్రాణ పర్యంతమూ కొనసాగటానికి ప్రయత్నం చేయాలి.

# స్మరణం

స్వామియొక్క నామ, రూప, గుణ, ప్రభావ, లీలా, తత్త్వ రహస్యాదులకు సంబంధించిన అమృతమయగాథలను శ్రద్ధాపూర్వకంగా, ప్రేమపూర్వకంగా విని విన్న వాటిని, చదివిన వాటిని మననం చేసుకోవడం, మననం చేసుకొంటూ, చేసుకొంటూ మేను మరచి భగవంతుని స్వరూపంలో ధ్రువునిలా లీనమై వర్తించటం స్మరణభక్తి స్వరూపంగా చెప్పవచ్చును.

ఎంతవరకూ కుదిరితే అంతవరకూ, ఏకాంతంలో గాని, పవిత్రస్థానంలో గాని, సుఖంగా స్థిరమైన, సరళమైన ఆసనం మీదకూర్చొని ఇంద్రియాలను విషయరహితంగా చేసి, కోరికలను, సంకల్పాలను ప్రక్కకు నెట్టి ప్రశాంతమైన, వైరాగ్యభావంతో కూడిన చిత్తంతో నడుస్తూ తిరుగుతూ, కూర్చొని పడుకొని తింటూ తాగుతూ, ఇలా అన్ని పనులు చేసుకొంటూ కూడా సహజంగా, శుచిగా, సరళంగా భగవంతుని సగుణ, నిర్గుణ, సాకార*, నిరాకార తత్త్వాన్ని

---

* సగుణంగా సాకారంగా, ధ్యానం చేసే పద్ధతి ఒకటి శ్రీమద్భాగవతంలో చెప్పబడింది -

సమం ప్రశాంతం సుముఖం దీర్ఘచారుచతుర్భుజమ్।
సుచారుసుందరగ్రీవం సుకపోలం శుచిస్మితమ్॥
సమానకర్ణవిన్యస్తస్ఫురన్మకరకుండలమ్।
హేమాంబరం ఘనశ్యామం శ్రీవత్స శ్రీనికేతనమ్॥
శంఖచక్ర గదాపద్మ వనమాలా విభూషితమ్।
నూపురైర్విలసత్పాదం కౌస్తుభప్రభయా యుతమ్।
ద్యుమత్కిరీటకటకకటి సూత్రాంగదాయుతమ్।
సర్వాంగసుందరం హృద్యం ప్రసాదసుముఖేక్షణమ్।
సుకుమారమభి ధ్యాయేత్సర్వాంగేషు మనో దధత్॥ (11:14:38-41)

'సముడు, ప్రశాంతుడు, సుందరాననుడు, పొడుగాటి సుందరమైన నాలుగు - భుజాలు కలవాడు, అతి సుందర కంఠుడు, అందమైన చెక్కిలి కలవాడు, ప్రకాశించే చిరునవ్వు కలవాడు, చెవులకు దేదీప్యమానమైన మకర కుండలాలు ధరించినవాడు, నీలమేఘ సమాన వర్ణుడు, పీతాంబరుడు, హృదయంపై శ్రీవత్స, శ్రీలక్ష్మి చిహ్నాలతో ఒప్పువాడు, శంఖ,

తెలుసుకొని గుణ, ప్రభావ సహితమైన ఆ భగవత్స్వరూపాన్ని చింతన చేయడం, భగవన్నామాన్ని మనస్సులోనే స్మరిస్తూ ఉండటం, భగవల్లీలలను తలచుకొని ముగ్ధులవటం, భగవతత్త్వాన్ని, రహస్యాన్ని తెలుసుకోవడం కోసం ఆయన గుణ ప్రభావాలను చింతన చేయడం ఇంకా దివ్యస్తోత్రాలతో, పదాలతో మానసికంగా స్తోత్రపాఠాలతో ప్రార్థించడం మొదలైన విధంగా స్మరణ భక్తిని సాధించటానికి అనేక పద్ధతులు శాస్త్రాలలో చెప్పబడినవి.

ప్రభువు (స్వామి) యెడల అనన్యప్రేమకలిగి ఆయనను పొందడమే ఈ స్మరణభక్తి యొక్క ఉద్దేశ్యము.

ప్రేమికులైన భక్తులద్వారా నామ, రూప, గుణ, ప్రభావాది అమృతమయ గాథలను శ్రద్ధాపూర్వకంగా, ప్రేమపూర్వకంగా వినడం, భగవద్విషయకమైన ధార్మికగ్రంథాల పఠన పాఠనాదులు చేయడం, భగవన్నామ జపం చేయడం, కీర్తన చేయడం, భగవంతుని స్తోత్రాలతో, పదాలతో ఇంకా ఏవిధమైన పద్ధతిలోనైనా సరే! ధ్యానం కోసం కరుణభావంతో స్తుతించడం, ప్రార్థించటం, భగవంతుని ఆజ్ఞలను, మహా పురుషుల ఆజ్ఞలను శిరసా వహించడం మొదలైనవి ఉపర్యుక్త స్మరణ భక్తిని పొందటానికి కావలసిన పద్ధతులు –

పైన పేర్కొన్న స్మరణభక్తి వల్లనే సకల పాపాలు, విఘ్నాలు, అవగుణాలు, దుఃఖాలు తొలగి పోతాయి. భగవత్స్మరణ వల్ల మానవుడు కోరిన దెల్లా నెరవేర్చుకో గలుగుతాడు. భగవంతుణ్ణే చేరడమనే పరమశాంతిని పొందడం కూడా దీని ద్వారానే అతి శీఘ్రంగా సులభంగా నెరవేరుతుంది. శ్రుతిస్మృతులు, పురాణేతిహాసాలు, సత్పురుషులు, మహాత్ములు అందరూ ఏకకంఠంతో భగవత్స్మరణ (ధ్యానం) యొక్క మహిమను కీర్తించారు.

---

చక్ర, గదా, పద్మ, వనమాలా విభూషితుడు, చరణాలకు కట్టిన గజ్జెలతో శోభిల్లువాడు, కౌస్తుభమణి సన్నిభ కాంతి మంతుడు, కాంతులు వెదజల్లే కిరీటము, కడియము, మొలత్రాడు, కేయురాదులు ధరించినవాడు, సర్వాంగ సుందరుడు, మనోహరుడు, దయామయమైన నేత్రయుతుడు, అయిన ఆ సుకుమారుడైన భగవానుని సర్వాంగాలపై మనసు నిలిపి సమ్యక్ బుద్ధితో ధ్యానించ వలెను.

కఠోపనిషత్తులో ఇలా పేర్కొనబడింది.

**ఏతద్ధ్యేవాక్షరం బ్రహ్మ ఏతద్ధ్యేవాక్షరం పరమ్।**
**ఏతద్ధ్యేవాక్షరం జ్ఞాత్వా యో యదిచ్ఛతి తస్య తత్॥** (1:2:16)

ఈ "ఓం"కారమనే అక్షరమే బ్రహ్మ. ఇదే పరబ్రహ్మ. ఈ ఓంకార రూపి అక్షరబ్రహ్మను ఉపాసించి మానవుడు ఏ వస్తువును కోరుకుంటే అది లభిస్తుంది."

సంధ్యోపాసనావిధి మొదట్లో ఈ విధంగా వ్రాయబడి ఉంది -

**అపవిత్రః పవిత్రో వా సర్వావస్థాం గతోఽపి వా।**
**యః స్మరేత్ పుండరీకాక్షం స బాహ్యాభ్యంతరః శుచిః॥**

"అపవిత్రుడైనా, పవిత్రుడైనా ఏ (అవస్థ) స్థితిలో ఉన్నా, ఏ పురుషుడు పుండరీకాక్షుణ్ణి స్మరిస్తాడో, ఆతడు బాహ్యంగా, ఆంతరంగికంగా పరిశుద్ధుడవుతాడు." - శ్రీమద్భగవద్గీతలో భగవంతుడిలా పేర్కొన్నాడు-

**యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి।**
**తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి॥** (6/30)

"ఏ పురుషుడు సకల భూతాలలోను సకలాత్మరూపిని, వాసుదేవుడను అగు నన్ను వ్యాపించి యున్నట్లు చూచునో, మరియు సకల భూతాలను, వాసుదేవుడనగు నాయందే దర్శించునో, అట్టివానికి నేనెన్నడును అదృశ్యుడనుకాను. అట్లే నాకు కూడా అట్టివాడు అదృశ్యుడు కానేరడు."

**తస్మాత్సర్వేషు కాలేషు మా మనుస్మర యుధ్య చ।**
**మయ్యర్పితమనోబుద్ధిర్మామేవైష్యస్యసంశయమ్॥**
**అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా।**
**పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్॥** (గీతా 8/7;8)

"కాబట్టి అర్జునా! సర్వకాల సర్వావస్థల యందు నిరంతరం నన్ను స్మరించు. యుద్ధం కూడా చెయ్యి. ఈ విధంగా నాయందే అర్పించబడిన మనోబుద్ధులు కలవాడవై నిస్సందేహంగా నన్నే చేరుకోగలవు. అర్జునా!

ఇక్కడ నియమమేమిటంటే పరమేశ్వర ధ్యానమనే అభ్యాసరూపమగు యోగ యుక్తుడై మరోవైపు పయనించని చిత్తంతో నిరంతరం చింతన గావించే మానవుడు పరమప్రకాశరూపుడగు దివ్యపురుషుని అనగా పరమేశ్వరుని చేరుకొంటాడు."

**అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః।**
**తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః॥** (గీతా 8/14)

"ఓ అర్జునా! ఏ పురుషుడు అనన్య చిత్తుడై ఎల్లప్పుడు నిరంతరం పురుషోత్తముడనైన నన్ను స్మరించు చుండునో, నిత్యమూ నాలో నిమగ్నుడైనట్టి ఆ యోగికి నేను సులభుడను. అనగా సహజంగానే లభ్యం కాగలను."

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥** (గీతా 9:22)

"అనన్య ప్రేమికులైన నాభక్తులెవరు పరమేశ్వరుడనగు నన్ను నిరంతరం స్మరిస్తూ నిష్కామ బుద్ధితో భజించి చింతన చేస్తూంటారో అట్టి భక్తుల యోగక్షేమాలను నేనే స్వయంగా వహిస్తాను. (ప్రాప్తింప జేయుదును)."

**యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః।**
**అనన్యేనైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే॥**
**తేషామహం సముద్ధర్తా మృత్యు సంసార సాగరాత్।**
**భవామి నచిరాత్పార్థ మయ్యావేశితచేతసామ్॥**
**మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ।**
**నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః॥** (గీతా 12/6–8)

"కాని అర్జునా! నాయందు పరాయణులైన ఏభక్తజనులు సమస్తకర్మలను నాకే సమర్పించి నన్ను సగుణ రూప పరమేశ్వరునిగా (తైలధారాసదృ శంగా) ఏకాగ్రతతో అనన్య భక్తి యోగంతో నిరంతరం చింతన చేస్తూ భజించుచుందురో అట్టి ప్రేమిక భక్తజనులను, నాయందు చిత్తాన్ని లగ్నం చేసే వాళ్ళను, మృత్యుముఖ సంసారసాగరం నుండి అచిరకాలంలోనే

నేను ఉద్ధరిస్తాను. అందువల్ల ఓ అర్జునా! నువ్వు నా మీదనే మనసునూ, బుద్ధినీ నిలుపు. అటు పిమ్మట నీవు నాలోనే నివసిస్తావు. అనగా నీవు నన్నే చేరుకొంటావు. ఇందులో ఎట్టి సందేహమూ లేదు."

**చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః।**
**బుద్ధియోగముపాశ్రిత్య మచ్చిత్తః సతతం భవ॥**
**మచ్చిత్తః సర్వదుర్గాణి మత్ప్రసాదాత్త రిష్యసి॥** (గీతా: 18:57-58)

"ఓ అర్జునా! నీవు అన్ని కర్మలను మనసా నాకే అర్పించి, సమబుద్ధి రూప నిష్కామకర్మయోగాన్ని అవలంబించి, నాయందే పరాయణుడవై నిరంతరం నీ మనసు (చిత్తం) నామీదే ఉంచుము. పైన చెప్పినట్లు నాయందు మనసు నిలిపితే నా అనుగ్రహం వల్ల సమస్త ప్రతిబంధకాలను అనాయాసంగా అతిక్రమిస్తావు"

శ్రీమద్భాగవతంలో ఇలా చెప్పబడింది -

**కీటః పేశస్కృతా రుద్ధః కుడ్యాయాం తమనుస్మరన్।**
**సంరంభభయయోగేన విన్దతే తత్స్వరూపతామ్॥**
**ఏవం కృష్ణే భగవతి మాయామనుజ ఈశ్వరే।**
**వైరేణ పూత పాప్మానస్తమా పురను చింతయా॥**
**కామాద్ ద్వేషాద్భయాత్ స్నేహాద్యథా భక్త్యేశ్వరే మనః।**
**ఆవేశ్య తదఘం హిత్వా బహవస్తద్గతిం గతాః॥** (7/1/27-29)

"గోడమీద భ్రమరం ద్వారా అడ్డగించబడిన పురుగు భ్రమరం క్రోధానికి భయపడి దాన్నే స్మరిస్తూ అది భ్రమరంతో సమానమైనట్లు (పురుగు తుమ్మెదైనట్లు) మాయచేత మనుష్య జన్మనెత్తిన పరమేశ్వరుడైన శ్రీకృష్ణ భగవానుని యెడల వైరభావంతో పదే పదే చింతన చేస్తూ అనేకమంది పాపరహితులై ఆయనను చేరుకోగలిగారు. ఈ విధంగానే కామ, క్రోధ, భయ, స్నేహాదులతో, భక్తితో పరమేశ్వరుని యందు చిత్తాన్ని లగ్నం చేసి అనేకమంది సాధకులు పాపరహితులై పరమపదాన్ని పొందియున్నారు."

**శృణ్వన్ గృణన్ సంస్మరయంశ్చ చింతయన్**
**నామాని రూపాణి చ మంగలాని తే।**

**క్రియాసు యస్త్వచ్చరణారవిన్దయో -**
**రావిష్టచేతా న భవాయ కల్పతే॥** (శ్రీమద్భా: 10/2/37)

"ఏ పురుషుడు సకల కర్మలను ఆచరించేటప్పుడు, నీ మంగళమయ రూపాన్ని, భగవన్నామాలను వింటూ, చెబుతూ, స్మరిస్తూ, చింతన చేస్తూ నీచరణారవిందాల పైనే మనస్సు లగ్నం చేస్తాడో అతడు తిరిగి ఈ సంసారంలో అడుగు పెట్టడు."

**విషయాన్ ధ్యాయతశ్చిత్తం విషయేషు విషజ్జతే।**
**మామనుస్మరతశ్చిత్తం మయ్యేవ ప్రవిలీయతే॥** (శ్రీమద్భా: 11:14:27)

"విషయచింతన చేసేవాడి మనస్సు ఇంద్రియ సుఖాలపైనే ఆసక్తి పెంచుకొంటూంటుంది. కాని నన్నే పదేపదే స్మరించేవాడి మనస్సు నాలోనే లీనమై పోతుంది"

**అవిస్మృతిః కృష్ణపదారవిందయోః**
**క్షిణోత్యభద్రాణి శమం తనోతి చ।**
**సత్త్వస్య శుద్ధిం పరమాత్మ భక్తిం**
**జ్ఞానం చ విజ్ఞానవిరాగయుక్తమ్॥** (శ్రీమద్భా: 12:12:54)

"శ్రీకృష్ణ పరమాత్ముని చరణకమలాల స్మృతి (స్మరణ) సకల పాపాలను పోగొడుతుంది. ఇంకా అది అంతఃకరణాన్ని శుద్ధిచేస్తుంది. పరమాత్మయందు భక్తిని, విజ్ఞానాన్ని, వైరాగ్యసహిత జ్ఞానాన్ని, శాంతిని పెంపొందిస్తుంది."

విష్ణుసహస్రనామం మొదట్లో ఇలా పేర్కొనబడింది -

**యస్యస్మరణమాత్రేణ జన్మసంసారబంధనాత్।**
**విముచ్యతే నమస్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే॥**

"ఎవని స్మరణ మాత్రం చేత మానవుడు జన్మ రూపమైన సంసార బంధనం నుండి విముక్తుడవుతున్నాడో, ప్రపంచోత్పాదన చేసే ఆ విష్ణుమూర్తికి నమస్కారము."

శ్రీ తులసీదాస విరచిత రామాయణంలో సుతీక్ష్ణుడి స్మరణ భక్తి ప్రశంసనీయమైనది. సుతీక్ష్ణుడు భగవంతుని ప్రేమ మగ్నుడై మనస్సులోనే భగవంతుని స్మరణ చేస్తూ, ఇంకా ముందుకు వెళ్ళి అతడు శరీరాన్ని మనస్సును కూడా మరిచేంతగా ఆనంద పరవశుడయ్యాడు. అంతేకాదు, తనను తాను మరచిపోయి ముందుకు, వెనుకకు వెళ్ళుతుంటాడు. ఒక్కొకసారి నృత్యం చేస్తాడు. నవ్వుతాడు, కూర్చుంటాడు. లేచి పరుగెత్తుతుంటాడు. సుతీక్ష్ణుని భక్తి పారవశ్యమును చూసి, మురిసిపోయి హృదయకుహరంలో నుండి అదృశ్యుడాయెను. అయ్యో! నా ప్రభువు ఎక్కడ అని అతడు కనులు తెరవగానే ఎదురుగా సాక్షాత్కరించెను. అప్పుడాతడు –

"హే ప్రభో! నా హృదంతరసీమలో నిరంతరం నివాసముండిపో స్వామీ!"– అంటూ వరాన్ని అడిగాడు –

**అనుజ జానకీ సహిత ప్రభు చాప బాన ధర రామ।**
**మమ హియ గగన ఇందు ఇవ బసహు సదా నిహకామ॥**

సుతీక్ష్ణునికి భగవద్ధ్యానం అంటే మిక్కిలి ప్రీతికరమన్నది దీనివల్ల ఇక్కడ స్పష్టమవుతున్న విషయం. ఇదే విధంగా స్మరణ చేసే భక్తుల పేర్లు శాస్త్రాలలో విశేషంగా కనిపిస్తాయి. కాని గ్రంథవిస్తరభీతితో అందరి చరిత్రలు ఇవ్వకుండా కొద్ది మంది భక్తుల పేర్లనే పేర్కొనటం జరుగుతోంది. సనకాది మునులు, ధ్రువుడు, భీష్ముడు, కుంతి మొదలైన వారు స్మరణ భక్తి తోడనే పరమపద ప్రాప్తిని పొందారు. వీరే కాకుండా నిమ్నజాతికి చెందిన శబరి జటాయుపక్ష్యాదులకు కూడా భగవత్స్మరణ వల్ల పరమగతి లభించింది.

గుణ, ప్రభావ, ప్రేమ సహితమైన భగవంతుని స్వరూప ధ్యానంతో సమానమైనది; శీఘ్రమే ఉద్ధరించేది, మరే సాధనము ఈ భూ ప్రపంచంలో లేదు. సర్వ సాధనలకు సదా భగవత్స్మరణమే ఫలము. అందువల్ల మన జీవితమంతా పైన పేర్కొన్న విధంగా భగవచ్చింతనలో గడపటానికి నడుం బిగించి ప్రయత్నం చేయాలి.

కాబట్టి సర్వ కర్మలు నిర్వర్తిస్తూ కూడా తాబేలు తన అండములపై, ఆవు తన దూడపై, కామియైనవాడు స్త్రీపై, లోభియైనవాడు ధనంపై, నర్తకి తన చరణాలపై, మోటారు నడిపేవాడు రోడ్డుపై ఎటువంటి దృష్టి పెడతారో (ధ్యానాన్ని ఉంచుతారో) అదేవిధంగా భగవత్ప్రాప్తిని కోరుకొనే సాధక పురుషులు కూడా (తమతమ పనులు చేసుకొంటూ) పరమాత్మయందు దృష్టిని నిలపటం సముచితంగా ఉంటుంది.

* * *

# పాదసేవనం

సఞ్చింతయేద్భగవతశ్చరణారవిన్దం
వజ్రాంకుశధ్వజసరోరుహలాంఛనాఢ్యమ్।
ఉత్తుంగరక్త విలసన్నఖచక్రవాల-
జ్యోత్స్నాభిరాహతమహద్ధృదయాంధకారమ్॥
యచ్ఛౌచనిఃసృతసరిత్ప్రవరోదకేన
తీర్థేన మూర్ధ్న్యధికృతేన శివః శివోఽభూత్॥
ధ్యాతుర్మనః శమలశైలనిసృష్టవజ్రం
ధ్యాయేచ్చిరం భగవతశ్చరణారవిందమ్॥

(శ్రీమద్భా: 3:28:21–22)

"వజ్ర, అంకుశ, ధ్వజ, కమలాది చిహ్నాలను కలిగి శోభాయమానమైన రక్తవర్ణ, ఉన్నత నఖమండలి యొక్క కాంతులతో భక్తుల హృదయాలలోని మహాంధకారాన్ని సంపూర్ణంగా తొలగ జేయుచున్నటువంటి భగవచ్చరణ కమలాలను మిక్కిలి ప్రేమతో చింతన చేయాలి"–

"ఎవని చరణాలను ప్రక్షాళన చేయడం వల్ల వెడలిన (పాదోదకం) పవిత్ర గంగాజలాలను శిరస్సున దాల్చి, శివుడు శివత్వాన్ని పొంది యున్నాడో, ఎవని చరణాలను ధ్యానించెడు పురుషుని అంతఃకరణములో గుట్టల కొలదిగా పేరుకు పోయిన పాప రాశులు సైతము, – ఇంద్రుని వజ్రాయుధ ప్రయోగంతో పర్వతాలు ముక్కలై పోయినట్లుగా – పటాపంచలై పోవునో, అట్టి భగవానుని చరణకమలాలను నిరంతరం చింతన చేయాలి."

భగవానుని దివ్యమంగళరూపం గల ధాతు (బంగారము, వెండి మొ॥ వాటితో చేసిన) మూర్తిలోని, చిత్రపటంలోని లేదా మానసమూర్తి యొక్క మనోహర చరణాలను శ్రద్ధాపూర్వకంగా దర్శించటం, చింతన చేయటం, పూజించటం, ఇంకా సేవలు చేస్తూ, చేస్తూ ఆ భగవత్ప్రేమలో తన్మయులై వర్తించటమే "పాదసేవనం"గా చెప్పవచ్చును.

పదేపదే తనివితీరని నయనాలతో భగవచ్చరణారవిందాలను దర్శించటం, హస్తాలతో భగవచ్చరణాలకు పూజ సేయటం, పరిచర్య చేయటం, ఆ పాదోదకాన్ని (తీర్థమును) సేవించటం, మానసికంగా (మనసా) భగవచ్చరణాల గురించి చింతన, పూజన సేవనాదులు చేయటం, భగవంతుని (చరణ) పాదుకలకు హస్తాలతో పూజ చేయడం, అలాగే మనసా చింతన చేయడం, సేవలు చేయటం, పూజించటం, భగవంతుని చరణధూళిని మనసా శిరస్సుపై ధరించటం, హృదయానికి హత్తుకోవడం, భగవంతునిచే స్పృశింపబడిన భగవంతుని శయ్యాసనాదులను పుణ్యక్షేత్రాలకన్న మిన్నగా భావించి గౌరవించడం, అయోధ్య, చిత్రకూటం, బృందావనం, మధుర శ్రీశైలం, భద్రాచలం, తిరుపతి వంటి క్షేత్రాలను, ఇంకా భగవంతుడు అవతారమెత్తి అందరికీ ప్రత్యక్షమైన ప్రదేశాలను, ఆయన పాదాలతో ఏర్పడిన చిహ్నాలను పరమపుణ్యక్షేత్రాలుగా భావించి అక్కడి ధూళిని సాక్షాత్తు భగవత్పాద ధూళిగా ఎంచి శిరస్సున దాల్చడం, భగవంతుని చరణ స్పర్శను పొందిన ప్రతి వస్తువును హృదయపూర్వకంగా ఆదరించటం, వాటిని శిరస్సున దాల్చటం, ఇంకా పవిత్ర గంగాజలాలను భగవంతుని పాదోదకంగా భావించి ఆ జలాలకు వందనాలర్పించటం, పూజలు చేయటం, పవిత్ర స్నానమాచరించటం, భక్తితో సేవించటం, ద్వారా చేసే సేవలన్నీ 'పాదసేవనభక్తి'కి కావలసిన పలు విధాలయిన పద్ధతులు.

మమత, అహంకారము, అభిమానము వంటి వాటిని తొలగించుకొని స్వామి చరణాలపై అనన్య ప్రేమను పొందే ఉద్దేశ్యంతో పాదసేవనభక్తి ఆచరించబడుతోంది.

భగవంతుని యెడల సాటిలేని భక్తులైనవారి సాంగత్యం వల్ల చరణ సేవ తత్త్వ, రహస్య, ప్రభావాదులు తెలుసుకొనే (వినే) అవకాశం కలుగుతుంది. అప్పుడు దానియందు శ్రద్ధయేర్పడి ఆ భక్తి లభిస్తుంది.

కేవలం ఈ పాదసేవన భక్తితోడనే మనుష్యుల సకల దురాచారాలు, దుర్గుణాలు, దుఃఖాలన్నీ తొలగిపోవడమే కాకుండా భగవంతుని యెడల సహజంగానే శ్రద్ధ అతిశయించి, ప్రేమ పరిఢవిల్లి చివరకు అత్యంత

ప్రశాంతస్థితి లభ్యమవుతుంది. అలాంటి వారికి ఏదీ దుర్లభం కాబోదు.

శాస్త్రాలు, మహాత్ములు, పాదసేవనభక్తి యొక్క మాహాత్మ్యాన్ని పలు విధాల కీర్తించారు. శ్రీ శంకరాచార్యులవారు భగవచ్చరణ కమల రూపమైన నౌకయే ఈ సంసార సాగరాన్ని దాటించ గలదని పేర్కొన్నారు –

**అపారసంసారసముద్రమధ్యే**
**సమ్మజ్జతో మే శరణం కిమస్తి।**
**గురో కృపాలో కృపయా వదైత-**
**ద్విశ్వేశ పాదాంబుజదీర్ఘనౌకా॥**

"ఓ దయామూర్తులైన గురుదేవా! ఈ అపారసంసార రూపమైన సముద్రమధ్యంలో మునిగి పోకుండా ఉండటానికి ఆశ్రయమైన దేమిటో (సహాయమైనదేమిటో) దయచేసి సెలవీయండి!"– అని శిష్యుని ప్రశ్న ఇందుకు గురువుగారి సమాధానం –

గురువు – "భగవచ్చరణ కమలరూపమైన నౌక ఒక్కటే సరైన ఉపాయము."

భగవంతుని పాదోదకాన్ని సేవించి, దానిని శిరస్సున దాల్చటం వల్ల కూడా సర్వశుభాలు చేకూరుతాయి. శ్రీరామచంద్రుని చరణామృతాన్ని త్రాగి ఆయనను పడవమీద నదిని దాటించే సందర్భంలో ఆ పడవ నడిపే వాడి భాగ్యాన్ని కీర్తిస్తూ శ్రీతులసీదాసు ఇలా అంటాడు –

**పదపఖారి జలు పాన్ కరి ఆపు సహిత పరివార్।**
**పితర పారు కరి ప్రభుహి పుని ముదిత గయువు లేఇ పార్॥**

అనగా – శ్రీరామచంద్రభగవానుని పాదములను కడిగి, ఆ తీర్థమును తాను త్రాగుటయే గాక తన కుటుంబ పరివారముతో త్రాగించెను. తద్వారా అతని పితరులు ముక్తినొందిరి. అనంతరము అతడు ప్రభువును ఆనందముతో నదిని దాటించెను.

నిత్య నిరంతరంగా, ప్రతిక్షణం ప్రభు చరణాలను దర్శిస్తూ పరిచర్యలు చేయడంలో ఏవిధంగా ఆనందహృదయులము కావాలో, అది తెలుసుకోవడానికి

సీతాదేవినే మనం ఆదర్శంగా తీసుకోవాలి. వనగమన వేళలో ఆమె, శ్రీరామచంద్ర భగవానునితో ఇలా అంటుంది –

**ఛిను ఛిను ప్రభు పద కమల బిలోకీ। రహిహఉఁ ముదిత దివస జిమిఃకోకీ॥**
**మోహిమగ చలత న హోఇహి హారీ। ఛిను ఛిను చరన సరోజ నిహారీ॥**
**పాయ పఖారి బైఠి తరు ఛాహీఁ। కరిహఉఁ బావు ముదిత మన మాహీఁ॥**
**సమ మహి తృన తరు పల్లవ ఢాసీ। పాయ పలోటిహి సబ నిసి దాసీ॥**

సీతాదేవి శ్రీరామచంద్రునితో యిలా అంటుంది –

'ఓ ప్రభూ! నీ చరణ కమలములను తిలకించుచూ చకోరపక్షివలె రేయింబవళ్ళు ఆనందించెదను. త్రోవలో నడుచుచున్నప్పుడు (ముందుగా వెళుతున్న) నీ చరణ సరోజములను అనుక్షణము వీక్షించుట చేత బడలిక చెందకుండా హాయిగా నుండెదను. ఇక చెట్టు నీడన విశ్రమించినపుడు నీ సుందర చరణాలను కడిగి, ప్రక్కన కూర్చొని, వీవన వీస్తూ ముగ్ధురాలనయ్యెదను. (పడుకునే ముందు) నేలను సమానంగా, చదును జేసి, మెత్తగా నుండుటకై గడ్డిపరకలను, చిగుళ్ళను పరచి, ఈ సేవకురాలు పవిత్రమైన నీ పాద సంసేవనములో మునిగి రాత్రియంతయు ప్రసన్నురాలగుతుంది.'

శ్రీరామచంద్రుని చరణ చిహ్నాలను, చరణధూళిని చరణ పాదుకలను దర్శించి, పూజలు చేయటం ద్వారా భరతుడు ఎంతటి ఆనందాన్ని పొందాడో, ప్రేమతో తన్మయుడయ్యాడో, ఆ స్థితిని 'అధ్యాత్మరామాయణం'లో శివుని మాటల్లో పరికిద్దాం –

**స తత్ర వజ్రాంకుశవారిజాంచిత**
**ధ్వజాది చిహ్నాని పదాని సర్వతః।**
**దదర్శ రామస్య భువోఽతిమంగలా -**
**న్యచేష్టయత్పాద రజఃసు సానుజః॥**
**అహో! సుధన్యోఽహమమూని రామ**
**పాదార విందాంకితభూతలాని।**

**పశ్యామి యత్పాదరజో విమృగ్యం**
**బ్రహ్మాదిదేవైః శ్రుతిభిశ్చ నిత్యమ్॥** (అధ్యాత్మ: 2:9:2–3)

"అక్కడ ఆయన (భరతుడు) అన్ని వైపుల శ్రీరామచంద్రుని వజ్ర, అంకుశ, కమల, ధ్వజాది చిహ్నాలతో సుశోభితమైన – ఈ పృథ్వీ మండలానికి మిక్కిలి శుభప్రదమైన చరణ చిహ్నాలను చూశాడు. వాటిని చూసి సోదరుడైన శత్రుఘ్నునితో సహా, ఆ చరణ ధూళిలో దొర్లసాగాడు. ఆయన తనలో తాను ఇలా అనుకోసాగాడు – అహో! బ్రహ్మదేవుడు, శ్రుతులు సైతం సదా అన్వేషించే ఈ చరణ ధూళిని, పరమాత్ముడైన శ్రీరామచంద్రుని చరణారవిందాల చిహ్నాలతో విభూషితమైన ఈ నేలను నేనిప్పుడు చూస్తున్నాను. నేనెంతటి (పరమ) ధన్యుణ్ణి!!"

శ్రీగోస్వామి తులసీదాసుగారిలా అంటాడు –

**రజసిర ధరిహియఁ నయనన్హి లావహిఁ ।**
**రఘుబర మిలన సరిస సుఖ పావహిఁ ॥**

అనగా – 'భగవానుని చరణ చిహ్నిత పాదధూళిని చూసిన భరతుడు ఆనంద విహ్వలుడై, ఆ చరణధూళిని తన శిరస్సుపై, హృదయముపై, కనులపై ధరించి, స్వయంగా రఘునాథునితో కలిసినంతగా సంబరపడసాగెను.' భరతుని పాదసేవన భక్తికి వేరొక దృష్టాంతము –

**నిత పూజత ప్రభు పాఁవరీ ప్రీతి న హృదయఁ సమాతి।**
**మాగి మాగి ఆయసు కరత రాజకాజ బహు భాఁతి॥**

అనగా 'నందిగ్రామములోని తన కుటీరములో భరతుడు తన ప్రభువగు శ్రీరామచంద్రుని పాదుకలను ప్రతి నిత్యము పూజింపుచూ, తద్వారా పట్టరాని ప్రేమ ప్రవాహంలో అతని హృదయము ఉప్పొంగిపోయెడిది. అంతేగాక, (తన ప్రభువు పాదుకల ముందు నిలిచి) అడిగి – అడిగి ఆతని ఆజ్ఞతో వివిధ రాచకార్యాలను నెరవేర్చేవాడు.'

అహల్య పరమాత్ముని చరణ ధూళిని తాకి (పొంది) కృతార్థురాలవుతుంది. ఆమె అంటుంది –

**అహో కృతార్థాస్మి జగన్నివాస తే**
**పాదాబ్జసంలగ్నరజః కణానహమ్।**
**స్పృశామి యత్పద్మజశంకరాదిభి-**
**ర్విమృగ్యతే రంధిత మానసైః సదా॥** (అధ్యా.రా. 1:5:43)

"హే జగన్నివాస! నీ చరణకమలాల కంటియున్న ఆ ధూళికణాలను స్పృశించి నేడు నేను కృతార్థురాలనయ్యాను. అహో! బ్రహ్మదేవుడు, శంకరుడు మొదలైన వారందరూ మనసులగ్నం చేసి అన్వేషించే ఆ చరణారవిందాలను నేనిప్పుడు స్పృశిస్తున్నాను."

భగవచ్చరణాలను ఆశ్రయించటం వల్ల మానవునకు సకల దోషాలు నశించి, వాని సర్వవిపత్తులు తొలగి పోతాయి. ఆతడు గోష్పాదాన్ని దాటినట్టు సంసారాన్ని దాట గలుగుతాడు.

శ్రీమద్భాగవతంలో ఇలా చెప్పబడింది-

**తావద్భయం ద్రవిణగేహసుహృన్నిమిత్తం**
**శోకః స్పృహా పరిభవో విపులశ్చ లోభః।**
**తావన్మమేత్యసదవగ్రహ ఆర్తిమూలం**
**యావన్న తేఽంఘ్రిమభయం ప్రవృణీత లోకః॥** (3:9:6)

"హే ప్రభో! మానవులు నీ అభయ చరణకమలాలను, స్వచ్ఛమైన హృదయంతో ఆశ్రయించకుండా ఉండునంతవరకు, ధనము, ఇల్లు, మిత్రులు మొదలైన వాటి కారణంగా భయము, శోకము, స్పృహ, పరాజయము, మహాలోభము - ఇవన్నీ కలుగుతుంటాయి. సకల దుఃఖాలకు మూలము "ఇది నాది" అనే భ్రమకలుగుతూనే ఉంటుంది. అనగా భగవంతుని చరణాలను ఆశ్రయించగానే అవన్నీ తొలగిపోతాయి."

**సమాశ్రితా యే పదపల్లవప్లవం**
**మహత్పదం పుణ్యయశో మురారేః।**
**భవాంబుధిర్వత్సపదం పరం పదం**
**పదం పదం యద్విపదాం న తేషామ్॥** (శ్రీమద్భా: 10:14:58)

"సత్పురుషులకు ఆశ్రయణీయుడు, పవిత్రయశోవంతుడు అయిన భగవంతుని పదపల్లవ రూపమైన నౌకను ఆశ్రయించినవారికి ఈ సంసార సాగరం ఆవుదూడ పాదమంత అవుతుంది. వారికి ప్రతి అడుగులో పరమపదప్రాప్తి కలుగుతుంది. కాబట్టి వారికెప్పుడూ ఎట్టి ఆపదలూ కలుగవు."

**త్వయ్యంబుజాక్షాఖిలసత్త్వధామ్ని**
**సమాధినాఽఽ వేశితచేతసైకే।**
**త్వత్పాదపోతేన మహత్కృతేన**
**కుర్వంతి గోవత్సపదం భవాబ్ధిమ్॥** (శ్రీమద్భా: 10:2:30)

"హే కమలనయనా! చాలమంది సత్పురుషులు అఖిల జగన్నివాసుడవైన నీలో సమాధిద్వారా చిత్తాన్ని లగ్నం చేసి మహాత్ములద్వారా అనుభూతమైన నీచరణకమలాలను నౌకగా చేసుకొని సంసారసాగరాన్ని గోవత్సపదాన్ని దాటినట్లు దాటెదరు."

భగవంతుని చరణధూళిని ఆశ్రయించిన ప్రేమ భక్తులు స్వర్గాది సుఖాలేకాదు, మోక్షాన్ని సైతం తిరస్కరించి చరణధూళి సేవనంలో సంలగ్నులు కావడాన్ని కోరుకొంటారు. నాగపత్నులు ఇలా అంటారు-

**న నాకపృష్ఠం న చ సార్వభౌమం**
**న పారమేష్ఠ్యం న రసాధిపత్యమ్।**
**న యోగ సిద్ధీ రపునర్భవం వా**
**వాంఛంతి యత్పాదరజః ప్రపన్నాః॥** (శ్రీమద్భా: 10:16:37)

"నీ చరణ ధూళిని ఆశ్రయించిన భక్త జనులు స్వర్గాన్ని కాంక్షించరు. చక్రవర్తిత్వాన్ని అభిలషించరు. బ్రహ్మ పదాన్ని కోరుకొనరు. సంపూర్ణ భూమండలాధిపత్యాన్ని ఇంకా అధికమైన యోగసిద్ధులేమిటి? వారు మోక్షపదాన్ని కూడా వాంఛింపరు"

భగవంతుని పాద సేవనభక్తి తోడనే భగవంతుని అనన్య ప్రేమను పొందిన అనేకమంది భక్తుల వర్ణన శాస్త్రాలలో కనిపిస్తుంది. కాబట్టి మనం భగవంతుని చరణాలపై శ్రద్ధాపూర్వకంగా మనస్సు లగ్నం చేసి ఆ చరణాలకు నిత్యం పరిచర్యలు (సేవనం) చేయాలి.

# అర్చనం

**శ్రీ విష్ణోరర్చనం యే తు ప్రకుర్వంతి నరా భువి।**
**తే యాంతి శాశ్వతం విష్ణోరానందం పరమం పదమ్॥**

(విష్ణురహస్యమ్)

"ఈ ప్రపంచంలో భగవంతుని అర్చన పూజ చేసేవాళ్ళు భగవంతుని యొక్క అవినాశకరమైన, ఆనందస్వరూపమైన పరమపదాన్ని పొందుతారు."

భగవంతుని గురించి భక్తుల ద్వారా విన్నటువంటి, శాస్త్రాది గ్రంథాలలో చదివినటువంటి, లోహాదులతో తయారు చేయబడిన విగ్రహంలో గాని చిత్రపటంలోగాని దర్శించినటువంటి మన మనస్సుకు నచ్చిన ఏదైనా భగవత్స్వరూపానికి బాహ్యసామగ్రితో గాని, భగవంతునికి చెందిన ఏదైనా తమ తమ అభీష్టమైన భగవత్స్వరూపానికి చెందిన మానసికమూర్తిని నిర్మించుకొని మానసికసామగ్రితో గాని లేదా సకల భూతాలలో పరమాత్మస్థితిని భావించుకొని అందరిని సమాదరించి సత్కరిస్తూ యథాయోగ్యంగా, నానా విధ ఉపచారాలతో శ్రద్ధాపూర్వకంగా, భక్తిపూర్వకంగా పరమాత్మునికి పరిచర్యలు చేయడం గాని, ఆయన తత్త్వ రహస్య ప్రభావాలను తెలుసుకొంటూ తెలుసుకొంటూ ప్రేమ నిండిన హృదయంతో ముగ్ధులు కావడం గాని అర్చనభక్తి అనబడుతుంది.

పత్రం, పుష్పం, చందనం వంటి సాత్త్వికమైన, పవిత్రమైన ఇంకా న్యాయ సముపార్జితమైన ద్రవ్యాలతో భగవంతుని యొక్క విగ్రహానికి శ్రద్ధాపూర్వకంగా పూజలు చేయడం, భగవత్ప్రీతికోసం శాస్త్రోక్తమైన యజ్ఞాదులు నిర్వహించడం, సర్వులను పరమాత్మ స్వరూపులుగా భావించి తమ తమ వర్ణాశ్రమ ధర్మానుసారంగా వారికి యథాయోగ్యమైన సేవలు చేయడం, ఇంకా వారిని సత్కారాలతో, సమ్మానాలతో, పూజాదులతో సంతుష్టులను చేయడం, దుఃఖితులు, అనాథలు, వికలాంగుల వంటి పీడిత ప్రాణులలో – ఆకలిగొన్న వారికి అన్నంతో, దప్పికగొన్నవారికి జలంతో, వస్త్రహీనులకు వస్త్రాదులతో, రోగులకు ఔషధాదులతో, అనాథలకు ఆశ్రయ

దానాదులతో యథావశ్యకమైనవి యథాశక్తి సమర్పించి శ్రద్ధాపూర్వకంగా, సత్కారపూర్వకంగా సర్వులను భగవత్స్వరూపులుగా భావించి భగవత్ప్రీతి కోసం సేవ చేయడం మొదలైనవన్నీ భగవంతుని బాహ్యపూజా విధానాలే.

శాస్త్రాలలో వర్ణించబడిన, తమచిత్తమును అనాయాసంగా ఆకర్షించే భగవంతుని ఏదేని అలౌకిక రూప లావణ్య యుక్తమైన అనంతముగ్ధ సౌందర్యమయమైన, మాధుర్యమయమైన పరమ తేజోమండిత స్వరూపానికి చెందిన ప్రత్యేక అవయవ వస్త్ర, భూషణ, ఆయుధాలతో యుక్తమైన, హస్త పాదాదులను మంగళ చిహ్న సహితంగా మనసా చింతన చేసి ఆహ్లాదపూర్వకంగా మనస్సులో ఆయనను ఆవాహన చేసి స్థాపన చేయడం, ఇంకా నానావిధ మానసిక సామగ్రితో అత్యంత శ్రద్ధాపూర్వకంగా, ప్రేమపూర్వకంగా పూజలు చేయడం మానసిక పూజా విధానం అవుతుంది.

భగవంతుని యెడల అనన్యప్రేమ కలిగి ఆ ప్రేమను అందరూ పొందాలనే ఉద్దేశంతో అత్యంత శ్రద్ధాపూర్వకంగా స్వయంగా ఆచరణ చేయడం లేదా ఇతరులచే ఆచరింపజేయడం ఈ భక్తి యొక్క ప్రయోజనం.

అర్చన భక్తి స్వరూపాన్ని, దాని తత్త్వాన్ని అవగాహన చేసుకోవడానికి భగవంతుని పరమప్రియ భక్తుల సాంగత్యంతోపాటు వారికి పరిచర్యలు చేయడం (సేవించడం) చాలా అవసరం.

పైన పేర్కొన్న విధంగా భగవంతుని పూజించటం వల్ల మానవుడు తానేది కోరుకుంటే అది లభిస్తుంది. సహజంగానే ఆతనికి భగవత్ప్రాప్తి సిద్ధిస్తుంది. శ్రీమద్భాగవతంలో ఇలా చెప్పబడింది –

**స్వర్గాపవర్గయోః పుంసాం రసాయాం భువి సంపదామ్।**
**సర్వాసామపి సిద్ధీనాం మూలం తచ్చరణార్చనమ్॥** (10:81:19)

"భగవంతుని పాదాలకు అర్చన పూజలు చేయడం – జీవులందరకూ స్వర్గమోక్షాలతో పాటు, మర్త్యలోక, పాతాళలోకాలలోని సమస్త సంపదలకూ, సర్వ సిద్ధులకు మూలం."

తమతమ కర్మల ద్వారా భగవంతుని పూజించడం వల్ల భగవత్ప్రాప్తి

కలుగుతుంది. ఈ విషయాన్ని పరమాత్ముడు స్వయంగా భగవద్గీతలో ఇలా ప్రకటించాడు –

**యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్।**
**స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః॥** (18:46)

అనగా – 'ఏ పరమేశ్వరుని ద్వారా సంపూర్ణప్రాణుల ఉత్పత్తి జరిగెనో, ఎవని వలన సమస్త జగత్తు వ్యాప్తమై యున్నదో, ఆ పరమేశ్వరుని తన స్వాభావిక కర్మల ద్వారా పూజించి, మనుష్యుడు పరమసిద్ధిని పొందగలుగుచున్నాడు.'

ఇంతేకాదు అత్యంత శ్రద్ధతో, ప్రేమతో భగవంతునికి పూజ చేసినట్లయితే, ఆయన స్వయంగా తన దివ్యమంగళ విగ్రహరూపంతో ప్రత్యక్షమై, భక్తులు సభక్తికంగా అర్పించిన పదార్థాలను భుజిస్తాడు. ఈ విషయాన్ని భగవంతుడే ఇలా వెల్లడించాడు

**పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి।**
**తదహం భక్త్యుపహృతం అశ్నామి ప్రయతాత్మనః॥** (గీత: 9:26)

"అర్జునా! ఏ భక్తుడైననూ పత్రము, పుష్పము, ఫలము, జలములను నాల్గింటిలో ఏదేని ప్రేమతో నాకు సమర్పిస్తే అట్టి పరిశుద్ధమనస్కుడు, నిష్కామ భక్తుడూ సమర్పించిన ఆ పత్రపుష్పాదులను సగుణరూపంలో ప్రత్యక్షమై ప్రేమ పూర్వకంగా భుజించుచున్నాను. (స్వీకరించుచున్నాను.)"

పృథుచక్రవర్తి, అంబరీషుడు వంటి వారెందరో విధ్యుక్తంగా, వివిధోపచారాలతో, మానసికంగా ఇంద్రియాలతో భగవంతుని పూజించి సులభంగా పరమగతిని పొందారు. వీళ్ళ విషయం అలా వుంచితే ఏవిధమైన ఉపచారాలు లేకుండానే కేవలం భక్తి పూర్వకంగా పూజలు చేసిన కుచేలుడు కేవలం అటుకులతో, గజేంద్రుడు పుష్పములతో, ద్రౌపది శాక పత్రంతో పూజించి పరమ సిద్ధిని పొందారు. శబరి వంటి నిమ్నజాతి స్త్రీ కూడా కేవలం రేగు పండ్లతోనే పరమాత్మను సంతుష్టుణ్ణి చేసి పరమపదాన్ని పొందింది.

కాబట్టి భగవత్ప్రేమలో విహ్వలులై శ్రద్ధాపూర్వకంగా తమతమ అభిరుచుల కనుగుణంగా, భావానుసారంగా భగవంతుని అర్చించు కోవాలి.

# వందనం

ధ్యేయం సదా పరిభవఘ్నమభీష్టదోహం
తీర్థాస్పదం శివ విరించినుతం శరణ్యమ్।
భృత్యార్తిహం ప్రణతపాల భవాబ్ధిపోతం
వందే మహాపురుష తే చరణారవిందమ్॥(శ్రీమద్భా: 11:5:33)

"హే పురుషోత్తమా! హే ప్రణతపాల! సదా ధ్యాన యోగ్యమైనవి; పాపతాపాలను తొలగించేవి; సకల మనోరథాలను నెరవేర్చేవి; సర్వతీర్థాలకు ఆధారభూతమైనవి; బ్రహ్మరుద్రాదులచే నమస్కరింప బడేవి; శరణాగత రక్షణలో ప్రావీణ్యము గలవి; సేవకుల ఆపదలను బాపేవి; ఇంకా సంసార సాగరానికి నౌకవంటివి అయిన నీ చరణ కమలాలకు నేను 'వందనము చేయుచున్నాను."

శాస్త్రాలలో వర్ణించిన భగవత్స్వరూపానికి, నామానికి ఇంకా లోహాదులతో తయారు చేసిన విగ్రహానికి, చిత్రానికి లేదా మానసిక మూర్తికి శారీరకంగా, లేదా మానసికంగా, శ్రద్ధాపూర్వకంగా సాష్టాంగ ప్రణామం చేయడం లేదా సమస్త చరాచర భూతాలను, పరమాత్మ స్వరూపంగా భావించి శ్రద్ధగా, శారీరకంగా లేదా మానసికంగా నమస్కరించడం, అలా చేస్తూ భగవత్ప్రేమలో ముగ్ధులుకావడం వందన భక్తి అవుతుంది.

దేవాలయాలకు వెళ్ళి శ్రద్ధాభక్తి పూర్వకంగా భగవంతుని విగ్రహానికి సాష్టాంగ ప్రణామం చేయడం, తమతమ ఇళ్ళల్లో దేవుని ప్రతిమను, చిత్రపటాన్ని, భగవన్నామాన్ని, భగవంతుని చరణాలను, చరణపాదుకలను, భగవంతుని తత్త్వ, రహస్య, ప్రేమ, ప్రభావాలను, భగవంతుని మధురలీలలను వర్ణించిన సత్ శాస్త్రగ్రంథాలను, సమస్త చరాచర జీవులను, భగవత్స్వరూపాలుగా భావించి, లేదా భగవంతుడు వారి హృదయాంతర స్థితుడైయున్నట్లు భావించి, శ్రద్ధగా, వినయపూర్వకంగా, సభక్తికంగా, గద్గదభావంతో వందనాలర్పించుట, వందన భక్తికి కావలసిన వివిధ పద్ధతులు.

శ్రీమద్భాగవతంలో యోగీశ్వరుడైన కవి ఇలా పేర్కొన్నాడు -

**ఖం వాయుమగ్నిం సలిలం మహీంశ్చ**
**జ్యోతీంషి సత్త్వాని దిశో ద్రుమాదీన్।**
**సరిత్సముద్రాంశ్చ హరేః శరీరం**
**యత్కించ భూతం ప్రణమేదనన్యః॥** (11:2:41)

"ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథ్వి, నక్షత్రాలు, దిక్కులు, వృక్షలతాదులు, ఇంకా నదులు, సముద్రాలు, సకల ప్రాణికోటి భగవంతుని శరీరమే; కాబట్టి భగవంతుని యెడల అనన్యభక్తి కలవాడు యావజ్జగత్తును భగవంతునిగా భావించి నమస్కరించ వలయును."

భగవంతుని సర్వత్రా సర్వవ్యాపిగా భావించి ఆయనకు ఏవిధంగా నమస్కరించాలన్న విషయంలో అర్జునుడే మనకు చక్కని ఆదర్శప్రాయుడు. అర్జునుడు భగవానునికి నమస్కరిస్తూ ఇలా అంటాడు -

**నమః పురస్తాదథ పృష్ఠతస్తే**
**నమోఽస్తు తే సర్వత ఏవ సర్వ।**
**అనంతవీర్యామితవిక్రమస్త్వం**
**సర్వం సమాప్నోషి తతోఽసి సర్వః॥** (గీత: 11:40)

"హే అనంత సామర్థ్యశాలీ! నీకు ముందు, వెనుక, అన్ని వైపులనుండీ నా నమస్కారాలు. ఓ సర్వాత్మా! అమితపరాక్రమ శాలివైన నీవు సర్వత్రా వ్యాపించి యున్నావు. అందువల్ల సర్వమూ నీవే!"

శ్రీ తులసీదాస్‌జీ సకల జగత్తును "అంతా రామమయంగా" దర్శించి నమస్కరిస్తూ ఇలా అంటున్నాడు -

**సీయ రామమయ సబ జగ జానీ। కరఉఁ ప్రనామ జోరి జుగ పానీ॥**

భగవంతుని యెడల సాటిలేని ప్రేమను కలిగి భగవంతుని పొందడమే ఈ భక్తి ఉద్దేశ్యము. భగవంతునికి ప్రియమైన భక్తుల సాంగత్యం చేస్తూ, లబ్ధిపొందుట ద్వారా భగవంతుని వందన భక్తిలోని రహస్య, ప్రభావ,

తత్త్వాలను అవగాహన చేసుకోవడం వల్ల ఈ వందన భక్తిని పొందవచ్చును.

భగవంతుని రహస్యాలను తెలుసుకొని ఆయనకు నమస్కరించేవాడు సమస్త దుఃఖాలనుండి విముక్తుడవుతాడు. "మనుస్మృతి" వాక్యాలు ఇలా పేర్కొంటున్నాయి:-

**న వాసుదేవాత్పరమస్తి మంగలం**
**న వాసుదేవాత్పరమస్తి పావనమ్।**
**న వాసుదేవాత్పరమస్తి దైవతం**
**తం వాసుదేవం ప్రణమన్న సీదతి॥** (101)

"వాసుదేవ భగవానుని కంటే అధికమైన మంగళదాయకమైనది మరొకటి లేదు. వాసుదేవుని కంటే అధిక తమమైన, పావనమైనది ఇంకొకటిలేదు. ఇంకా వాసుదేవునికంటే శ్రేష్ఠమైన మరో ఆరాధ్యదేవత లేదు. అట్టి వాసుదేవునికి నమస్కరించేవాడు ఎన్నటికి (ఎప్పటికీ) దుఃఖితుడు కాబోడు."

**ఏకోఽపి కృష్ణస్య కృతః ప్రణామో**
**దశాశ్వమేధావభృథేన తుల్యః।**
**దశాశ్వమేధీ పునరేతి జన్మ**
**కృష్ణప్రణామీ న పునర్భవాయ॥** (మహా.శాన్తి.భీష్మస్తవరాజః-91)

"శ్రీకృష్ణ భగవానునికి సమర్పించిన ఒక్క నమస్కారమైనా సరే! అది పది అశ్వమేధయాగాలలో చేసిన అవభృథస్నానంతో సమానమవుతుంది. ఇంతేకాదు దశాశ్వమేధాలు నిర్వహించిన వానికి మరోజన్మ ఎత్తాల్సి వస్తుందేమోగాని శ్రీకృష్ణ భగవానునికి నమస్కరించిన వానికి మరో జన్మంటూ ఉండబోదు."

శ్రద్ధాబద్ధులై భగవానునికి నమస్కరించే వాళ్ళ సంగతి అలావుంచి, ఏ పరిస్థితిలో ఉన్నప్పటికి భగవంతునికి నమస్కరించడం వల్ల సకల పాపాలూ తొలగిపోతాయి -

**పతితః స్ఖలితశ్చార్తః క్షుత్వా వా వివశో బ్రువన్।**
**హరయే నమ ఇత్యుచ్చైర్ముచ్యతే సర్వపాతకాత్॥**(శ్రీమద్భా: 12:12:46)

"పతితుడు, స్ఖలితుడు, ఆర్తుడు, తుమ్ముతూ లేదా మరే విధంగా వివశుడైన పురుషుడు ఎలుగెత్తి "హరయే నమః" - అంటూ ఉచ్చరించిన పక్షంలో వాడు సకల పాపాల నుండి (వి)ముక్తుడవుతాడు."-

అనేకమంది భగవద్భక్తులు ఈ విధంగా నమస్కరించి పరమపదాన్ని పొందారు. అక్రూరుడు ముగ్ధుడై నమస్కరిస్తున్న తీరును చూడండి -

**రథాత్తూర్ణమవప్లుత్య సోఽక్రూరః స్నేహవిహ్వలః।**
**పపాత చరణోపాంతే దండవద్రామ కృష్ణయోః॥**

(శ్రీమద్భా: 10:38:34)

"అక్రూరుడు ప్రేమ విహ్వలుడై అతి శీఘ్రంగా రథం నుంచి దుమికి బలరామకృష్ణుల చరణాల మీద సాష్టాంగ పడ్డాడు." -

భీష్మ పితామహుడు పులకితుడై భగవానునికి నమస్కారం చేస్తున్నాడు. భగవంతుడు తత్క్షణం ఆయనకు తన దివ్యజ్ఞానాన్ని ప్రసాదిస్తున్నాడు. వైశంపాయనముని దీన్నే ఎలా పేర్కొంటున్నాడో చూడండి -

**ఏతావదుక్త్వా వచనం భీష్మస్తద్గతమానసః।**
**నమ ఇత్యేవ కృష్ణాయ ప్రణామమకరోత్తదా॥**
**అభిగమ్య తు యోగేన భక్తిం భీష్మస్య మాధవః।**
**త్రైలోక్య దర్శనం జ్ఞానం దివ్యం దత్త్వా యయౌ హరిః॥**

(మహా.శాన్తి.భీష్మ స్తవరాజః 100-101)

"చిత్తము ఈశ్వరునిలో తన్మయమైన (లగ్నమైన) భీష్మ పితామహుడు అనేక విధాల భగవన్నుతి (స్తుతి) చేసిన తరువాత "నమః కృష్ణాయ" - అంటూ భగవంతునికి ప్రణామాలర్పించాడు. అప్పుడు శ్రీకృష్ణ భగవానుడు యోగశక్తి ద్వారా భీష్ముని భక్తిని గ్రహించి ఆయనకు త్రిలోకాలను (భగవత్స్వరూపాన్ని) ప్రత్యక్షం చేయగల దివ్యజ్ఞానాన్ని ప్రసాదించి తరలి వెళ్ళాడు."

కాబట్టి భగవత్ప్రేమలో సంలగ్నులై పైన పేర్కొన్న విధంగా భగవంతునికి వందన భక్తిని నిర్వర్తించటానికి (ప్రణామాలర్పించటానికి) ప్రాణ పర్యంతమూ ప్రయత్నించాలి.

# దాస్యం

**సో అనన్య జాకేం అసి మతి న టరఇ హనుమంత।**
**మైఁ సేవక సచరాచర రూప స్వామి భగవంత॥**

"ఓ హనుమా! 'నేను సేవకుడను, ఈ చరాచర సృష్టి యంతయు నా భగవంతుని స్వరూపము' అను నిశ్చయము నుండి ఎవని బుద్ధి తొలగకుండునో, అట్టి వాడే అనన్యభక్తుడు అనబడును." అని శ్రీరామచంద్రుడు వివరించెను.

భగవంతుని గుణ, తత్త్వ, రహస్య, ప్రభావాదులను తెలుసుకొని శ్రద్ధా పూర్వకంగా ఆయన సేవలు చేయడం, ఆయన ఆజ్ఞలు శిరసావహించడం దాస్యభక్తి అగుతుంది.

దేవాలయంలోని దేవతా విగ్రహాలకు సేవలు చేయడం, దేవాలయాన్ని కడిగి, తుడిచి, శుభ్రం చేయడం, మానసికంగా ఆ ప్రభువు (స్వామి) యొక్క స్వరూపాన్ని ధ్యానించి, సేవించడం, సకల చరాచరాలను స్వామి రూపంగా భావించి అందరికీ (అన్నిటికీ) యథాశక్తిగా యథాయోగ్యంగా సేవలందించటం, భగవద్గీతాది శాస్త్రాలను (శాస్త్రాలలో చెప్పినవాటిని) భగవదాజ్ఞగా భావించి దానిని అనుసరించి ఆచరించడం, భగవంతునికి ప్రీతికరమైనవి, సంతోషదాయకమైనవి, భగవదిచ్ఛాను కూలమైనవి అయిన సత్కార్మలను ఆచరించడం మొదలైనవన్నీ దాస్యభక్తికి సంబంధించిన పద్ధతులు.

భగవంతుని రహస్యాలను బాగా తెలుసుకొన్న ప్రియ భక్తుల సాంగత్యం ద్వారా దాస్యభక్తిని సాధించవచ్చును.

భగవంతుని యెడల సాటిలేని ప్రేమను పొందటానికి ఆయనను నిత్యము ఎల్లప్పుడూ సేవించటానికి ఆయన సమీపంలో ఉండాలనే ఉద్దేశ్యంతో 'దాస్యభక్తి' ఆచరించబడుతోంది.

కేవలం ఈ దాస్య భక్తి తోడనే మానవునికి సహజంగానే భగవత్ప్రాప్తి సిద్ధిస్తుంది.

శ్రీ గోస్వామి తులసీదాసు గారు అయితే దాస్యభక్తి లేకుండా భగసాగరమునుండి ఉద్ధరింపబడలేమని అంటున్నారు –

**సేవక సేబ్య భావ బిను భవ న తరిఅ ఉరగారి।**
**భజహు రామపద పంకజ అస సిద్ధాంత బిచారి॥**

కాకభుశుండి, గరుత్మంతునితో ఇట్లు చెప్పెను – 'ఓ గరుత్మంతా! సేవ్య, సేవకభావము లేకుండా భవసాగరమును దాటుట అసాధ్యము. కనుక (ఈభావంతో) శ్రీరామచంద్ర ప్రభువు పాదకమలములను భజించుటయే సకల సిద్ధాంత సారమని తెలియుము.'

శ్రీ లక్ష్మణుడు, హనుమంతుడు, అంగదుడు వంటి వారలు దాస్యభక్తికి ఆదర్శప్రాయులు. శ్రీరామచంద్రుడు అడవులకు వెళ్ళే సమయంలో లక్ష్మణుని స్థితిని వర్ణిస్తూ తులసీదాసుగారు ఇలా అంటారు –

**ఉతరు న ఆవత ప్రేమ బస గహే చరన అకులాఇ।**
**నాథ దాసు మైఁ స్వామి తుమ్హ తజహు త కాహ బసాఇ॥**

లక్ష్మణుడు, శ్రీరాముని ప్రేమకు వివశుడై, గొంతు విప్పి చెప్పుటకు అసమర్థుడై, వ్యాకులంతో స్వామి పాదములపై పడిపోయి, ఇట్లనెను – 'నేను నీ దాసుడను, నీవునా స్వామివి. కావున నీవే నన్ను విడిచి పెట్టినచో, యిక నేనేమి చేయుదును?'

అలాగే సుమిత్రకూడా లక్ష్మణుణ్ణి, రామునివెంట వెళ్ళి ఆయన సేవ చేయవలసిందిగా ఎలాంటి చక్కని ఉపదేశాన్నందించిందో చూడండి –

**రాగు రోషు ఇరిషా మదు మోహూ। జని సపనేహుఁ ఇన్హ కే బస హోహూ॥**
**సకల ప్రకార బికార బిహాఈ। మన క్రమ బచన కరేహు సేవకాఈ॥**
**జేహిఁ న రాము బన లహహిఁ కలేసూ।**
**సుత సోఇ కరేహు ఇహఇ ఉపదేసూ॥**

సుమిత్రాదేవి, లక్ష్మణునితో యిట్లు చెప్పుచున్నది – 'లక్ష్మణా! కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాది షడ్వికారములకు నీవు కలలోనైనా వశుడవుగారాదు. సకల వికారములను త్యజించి, సర్వవిధముల శ్రీ సీతారాముల సేవ చేయుము. నాయనా! అడవిలో శ్రీరామచంద్రునకు ఎలాంటి కష్టము కలుగకుండా జాగ్రత్తగా చూడుము. ఇదియేనా ఉపదేశము.'

శ్రీరామభక్త హనుమానుని జీవితమంతా దాస్యభక్తితో ఓతప్రోతమై ఉంది. ఋష్యమూక పర్వతం మీద ప్రథమ దర్శనంలోనే శ్రీరామచంద్రభగవానుని గుర్తించి హనుమంతుడిలా అంటాడు –

**ఏకు మైఁ మంద మోహబస కుటిల హృదయ అగ్యాన్।**
**పుని ప్రభు మోహి బిసారేవు దీనబంధు భగవాన్॥**
**జదపి నాథ బహు అవగున్ మోరేం। సేవక ప్రభుహి పరై జని భోరేం।**
**నాథ జీవ తవ మాయాఁమోహా। సో నిస్తరఇ తుమ్హారేహిఁ ఛోహా॥**
**సేవక సుత పతి మాతు భరోసేం। రహఇ అసోచ్ బనఇ ప్రభు పోసేం॥**

అనగా– 'ముందుగా నేను మందమతిని, మోహవశుడను, ఇక చివరగా కుటిల మనస్కుడను, అజ్ఞానిని కావున ఓ దీనబంధూ! నీవు నన్ను మరచితివికదా! ఓ స్వామీ! నాలో అనేక దోషములు ఉన్నప్పటికినీ నీవు నన్ను మరచి పోవలదు. నీ మాయ చేత మోహితుడైన జీవుడు, నీ కృపవల్లనే మాయను దాటి పోగలడు. సేవకుడు, తన స్వామిపైన, పుత్రుడు తన తల్లిపైన భారం వేసి నిశ్చింతగా నుండగలడు కావున తన సేవకుని పాలన పోషణ చేయుట స్వామికి తప్పదు కదా!'

అలాగే శ్రీరామచంద్రుడు కూడా తన సేవక వాత్సల్యాన్ని వ్యక్త పరుస్తూ హనుమంతుణ్ణి లేవదీసి తన హృదయానికి హత్తుకొని ప్రేమ (ఆనంద) భాష్పాలతో హనుమంతుని శరీరాన్నంతా తడుపుతూ ఇలా అంటాడు –

**సునుకపి జియఁ మానసిజని ఊనా। తైఁ మమ ప్రియ లఛిమన తే దూనా॥**
**సమదరిసే మోహి కహ సబ కోవూ। సేవక ప్రియ అనన్య గతి సోవూ॥**

"ఓయి కపీ! వినుము! నాకేమోతక్కువైనదని చిన్నబుచ్చుకొనకుము. లక్ష్మణునికంటే నీవు, నాకు రెట్టింపు ప్రియమైనవాడవు. అందరూ నన్ను సమదర్శి అని యందురుకాని, అనన్య గతి నొందిన సేవకుడు నాకు మిక్కిలి ప్రియమైనవాడని తెలియుము."

దాస్య భక్తులైనవారు తమ స్వామి కృపయందు ఎంతటి విశ్వాసపాత్రంగా ఉంటారన్నది హనుమంతుడొకసారి విభీషణునితో అంటాడు. ఆ వచనాలు చిరస్మరణీయాలు –

**సునహుఁవిభీషన్ ప్రభు కై రీతీ । కరహిఁ సదా సేవక పర ప్రీతీ॥**
**కహహు కవన మైఁ పరమ కులీనా। కపి చంచల సబహీ బిధి హీనా॥**

**అసమైఁ అధమ సఖా సును మోహూ పర రఘుబీర్।**
**కీన్హీ కృపా సుమిరి గున భరే బిలోచన నీర్॥**

హనుమంతుడు ఒకమారు విభీషణునితో ఇట్లు చెప్పెను – 'మిత్రమా! ప్రభువు ఎల్లప్పుడు తన సేవకుని మీదే ప్రేమ కలిగియుండును. కాని చెప్పడానికి నేను కులీసుడనుకాను. చంచలమైన వానరుడను. అన్ని విధాలుగా నీచమైన వాడను. అధముడను. అయినప్పటికినీ శ్రీరామచంద్రుడు నన్ను కూడా కరుణించినాడు కదా! అని యిట్లు భగవంతుని గుణములను స్మరించుకొనిన ఆంజనేయుని నేత్రములు అశ్రుపూరితములయ్యెను.'

శ్రీరామ చంద్రుడు అంగదుణ్ణి అయోధ్యనుండి మరలివెళ్ళుమని చెప్పే సందర్భంలో అంగదుడు రాముణ్ణి ఇలా ప్రార్థిస్తాడు –

**మోరే తుమ్హ ప్రభు గుర పితు మాతా! జావుఁ కహఁ తజి పద జలజాతా।**
**తుమ్హహి బిచారి కహహు నరనాహా। ప్రభు తజి భవన కాజ మమ కాహా॥**
**బాలక గ్యాన బుద్ధి బల హీనా। రాఖహు సరన నాథ జన దీనా।**
**నీచి టహల గృహ కై సబ్ కరిహఉఁ। పద పంకజ బిలోకి భవ తరిహఉఁ॥**

'ఓ ప్రభూ! నాకు మాత్రం తల్లి, తండ్రి, గురువు, స్వామి సర్వస్వమూ నీవే, అట్టి నీ చరణ కమలములను విడిచి ఎటు వెళ్ళగలను? ఓ

మహారాజా! మిమ్ములను విడిచి పెట్టిన పిదప ఇంటితో నాకేమి పనికలదో? మీరే విచారించి చెప్పండి. జ్ఞానము, బుద్ధి, బలము వంటివి అసలే లేని వాడను, అమాయక బాలుడను, దీనుడను అయిన ఈ సేవకుడిని నీ శరణములోనే ఉండనిమ్ము. ఇక్కడే ఉండి ఏదో ఒక సేవ చేస్తూ, నీ పాదపద్మములను దర్శించుచు, భవసాగరము నుండి తరించి పోవుదును.'

ఇల్లాంటివే ఎన్నో ఉదాహరణలు మనకు కనిపిస్తాయి. కాబట్టి మనమందరం భగవంతుని యెడల ప్రేమ విహ్వాలులమై మనో వాక్కాయములు అన్నింటినీ అర్పించి 'దాస్యభక్తి'ని ఆచరించ వలయును.

* * *

# సఖ్యం

**అహో భాగ్యమహో భాగ్యం నందగోపవ్రజౌకసామ్।**
**యన్మిత్రం పరమానందం పూర్ణం బ్రహ్మ సనాతనమ్॥**

(శ్రీమద్భా: 10:14:32)

"పరమానంద పరిపూర్ణ సనాతన బ్రహ్మమైన (పరమాత్ముడు) మిత్రుణ్ణి కలిగిన ఆ నందగోపకులంలో నివసించే ప్రజలభాగ్యం ఎంత ధన్యం! ఎంత ధన్యం!!"

భగవంతుని ప్రభావ, తత్త్వ, రహస్య మాహాత్మ్యాలను అవగతం చేసికొని పరమవిశ్వాస పూర్వకమైన మైత్రీభావంతో ఆయన అభిరుచుల కనుగుణంగా మెలగటం, ఆయన యందు అనన్యప్రేమను కల్గి ఉండటం, ఇంకా ఆయన గుణ, రూప, లీలాదులను తెలుసుకొని ముగ్ధులై నిత్యనిరంతరంగా ప్రసన్నులై వర్తించటం సఖ్యభక్తిగా చెప్పవచ్చును.

తనకు అత్యంత ఆవశ్యకమైన పనులను సైతం విడిచిపెట్టి తన ప్రియతముడైన ప్రేమికుని పనులను ఆదరపూర్వకంగా నిర్వర్తించటం, ప్రియమైన ప్రేమికుని పనియందు తనపనిని తుచ్ఛమైనదిగా భావించి, దాని యెడల నిశ్చింతగా ఉండటం, ప్రియమైన ప్రేమికునికోసం మిక్కిలి అలసట పొందినప్పటికీ దానిని చాలా స్వల్పమైన దానిగా భావించటం, స్నేహితుడు ఏయే విషయాలలో ప్రసన్నుడవుతాడో ఆయా విషయాలపై శ్రద్ధవహించి ఎల్లప్పుడు అతనికోసమే ప్రాణపర్యంతమూ కృషిచేయడం, ఆతడు ఏది చేసినా ఆ పనులవల్ల ఎల్లప్పుడూ సంతుష్టుడై మెలగడం, తనవస్తువు ఏదైనా, ఏవిధంగానైనా తన నేస్తగానికి ఉపయోగపడే పక్షంలో పరమానందాన్ని పొందడం, తన శరీరంపైన, వస్తువులపైన ఆత్మీయత, అధికారం ఉన్నట్లే తన ప్రియమైన ప్రేమికుని యెడల కూడ భావించటం, అలాగే అతని వస్తువులపైన, శరీరంపైన తన అధికారాన్ని, ఆత్మీయతను భావించడం, తన ధనాన్ని, జీవనాన్ని, ఇంకా తన శరీరాదులను ప్రియస్నేహితుని పనులలో నిమగ్నం చేయగలగటాన్నే సాఫల్యంగా భావించడం, అతనితో ఉండటానికి

నిరంతరం ఇష్టపడటం, ఆతని దర్శన, భాషణ, చింతన, స్పర్శలతో ప్రేమలో నిమగ్నమవడం, ఆతని నామ, రూప, గుణ, చరిత్రాదులను విని, చెప్పుకొని, చదువుకొని ఇంకా వాటిని తలుచుకొని అత్యంత ఆనంద భరితం కావడం, ఇతరులెవరి ద్వారానైనా సరే మిత్రుని సందేశాన్ని అందుకొని పరమానందభరితులు కావడం, ఆతని వియోగంలో వ్యాకులమవడం, ప్రతిక్షణం అతగాడిని కలుసుకోవాలని ఆశించడం, ఆతని కోసం నిరీక్షిస్తూ ఉండటం మొదలైనవి 'సఖ్యభక్తి' పద్ధతులు.

ప్రియతముడైన ప్రేమికునికి అత్యంత సుఖం కలగాలని, తన సఖ్యప్రేమ పరిపూర్ణంగా వృద్ధిపొందాలని, ఆతనితో ఎప్పుడూ వియోగం కలగకూడదనే ఉద్దేశ్యంతో ఈ సఖ్యభక్తి సాగించ బడుతుంది.

సఖ్యభక్తిని పొందటానికి భగవంతునికి ప్రియతములైన మిత్రులతో సాంగత్యం, పరిచర్య (సేవ), వారి జీవితచరిత్రల అధ్యయన మొనర్చుట, వారి యొక్క, భగవంతుని యొక్క గుణ, లీలాప్రభావాలను ప్రియ భక్తుల ద్వారా వినవలసి ఉంటుంది.

ఈ విధమైన కేవల సఖ్యభక్తితో కూడా మానవుని దుఃఖాలు, దోషాలు తొలగిపోయి, భగవత్ప్రాప్తి, భగవంతుని యెడల మిక్కిలి ప్రేమ కలుగుతుంది. భగవంతుడు ఆ ప్రియభక్తుని వశంలో ఉన్నంతవరకూ అతని శాంతి సంతోషాలకు అంతే ఉండబోదు.

మిత్రుని యెడల మిత్రుని యొక్క కర్తవ్యమెలా ఉండాలన్న విషయంలో శ్రీరాముడు తన మిత్రుడైన సుగ్రీవునితో ఇలా అంటాడు –

**జే న మిత్ర దుఖ హోహి దుఖారీ। తిన్హహి బిలోకత పాతక భారీ॥**
**నిజ దుఖ గిరి సమ రజ కరి జానా। మిత్రక దుఖ రజ మేరు సమానా॥**
**జిన్హ కే అసి మతి సహజ న ఆఈ। తే సఠ కత హఠి కరత మితాఈ॥**
**కుపథ నివారి సుపంథ చలావా। గున ప్రకటై అవగునన్హి దురావా॥**
**దేత లేత మన సంక న ధరఈ। బల అనుమాన సదా హిత కరఈ॥**
**బిపతి కాల కర సతగున నేహా। శ్రుతి కహ సంత మిత్ర గున ఏహా॥**

'తన మిత్రుని దుఃఖమును గాంచి దుఃఖపడని వారిని చూస్తేనే మహాపాపం కలుగుతుంది. తనకు గలిగిన పర్వతం వంటి కష్టాన్ని ధూళివలె, తన మిత్రునకు గలిగిన ధూళివంటి కష్టాన్ని మహా పర్వతం వలె అనుభవించాలి. కాని ఇలాంటి బుద్ధి సహజంగా లేనివారలు మూర్ఖులనబడుదురు. ఇటువంటి మూర్ఖులు ఇతరులతో బలవంతంగా మైత్రిని చేయుటెందుకు? తన మిత్రునిని చెడు త్రోవలో వెళ్ళనీయకుండా అడ్డుపడి, మంచిమార్గముపై నడిపించాలి. అంతేగాక, అతని దోషములను కన్నెత్తి చూడకుండా వుండి, అతని మంచి గుణములనే పొగడుతూ వుండుటయే నిజమైన మిత్ర ధర్మ మగుతోంది. ఇచ్చి పుచ్చుకోవడంలో శంకించ వలదు. తన శక్త్యనుసారముగా మేలునే తలపెడుతూ, విపత్కార సమయంలో వంద రెట్లు అధికంగా ప్రేమించగలగాలి. అని శ్రేష్ఠమగు మిత్రుని గుణములను గూర్చి శ్రుతి చెప్పినది.'

ఈ సఖ్యభక్తికి ఆదర్శప్రాయులైన వారిలో విభీషణుడు, సుగ్రీవుడు, ఉద్ధవుడు, అర్జునుడు, సుదాముడు, శ్రీదామాది వ్రజసఖుడు మొదలైనవారు ముఖ్యులు.

లంకా విజయం పూర్తయ్యాక విభీషణుడు శ్రీరాముని ఇలా కోరుకుంటాడు – "ఓ పరమాత్మ! ఒకసారి మీరు నా గృహానికి విచ్చేసి నన్ను కృతార్థుణ్ణి చెయ్యండి" – అంటూ శ్రీరామచంద్రుణ్ణి వేడుకొంటాడు స్నేహితుని వచనాలను విని భగవానుడు ప్రేమ విహ్వలుడై, కళ్ళల్లో ఆనందాశ్రువు లొలుకుతుండగా ఇలా అంటాడు – "సోదరా! నీ యొక్క సర్వస్వమూ నాదే కాని ఇప్పుడు భరతుని స్థితిని తలచి, తలచి నేనిక్కడ నిలువజాలకున్నాను."

**తోర కోస గృహ మోర సబ సత్య బచన సును భ్రాత।**
**భరత దసా సుమిరత మోహి నిమిష కల్ప సమ జాత॥**

అనగా– 'సోదరా! నా సత్యమైన మాటను ఆలకింపుము; నీ ధనము, గృహము సర్వస్వమూ నాదే. కాని అక్కడి భరతుని దశను తలపోసి, తలపోసి నాకు క్షణమొక యుగముగా గడుచుచున్నది.'

సుగ్రీవునితో మైత్రిని నెరపి శ్రీరాముడు తన ప్రాణప్రియమైన సీతాదేవిని సైతం మరచిపోయి ముందుగా సుగ్రీవుని గురించిన చింతలో లీనమయ్యాడు.

ఇంకా సుగ్రీవునితో ఆయన ఇలా అంటాడు:

**సఖా సోచ త్యాగహు బల మోరేం। సబ బిధి ఘటబ కాజ మైఁతోరేం॥**

'మిత్రమా! నా పై విశ్వాసముంచి నీవు నిశ్చింతుడవగుము. నీ సర్వ కార్యములను నేను సమకూర్చెదను గాక!'

భగవానుడు ఉద్ధవుని ఎంతగా ప్రేమించేవాడో, అది తెలిపేలా ఓసారి అతనితో ఇలా అంటాడు –

"సోదరా ఉద్ధవా! నీవంటి ప్రేమికుడైనవాడు ప్రియతముడైనట్లుగా, బ్రహ్మ, శంకరుడు, ఆదిశేషుడు, లక్ష్మీదేవి మొదలైనవారేకాదు. నా ఆత్మకూడా నాకు ప్రియతములు కారు."

**న తథా మే ప్రియతమ ఆత్మయోనిర్న శంకరః।**
**న చ సంకర్షణో న శ్రీర్నైవాత్మా చ యథా భవాన్॥**

(భాగవ – 11:14:15)

ఉద్ధవునికి శ్రీకృష్ణభగవానుని యెడల అపారమైన సఖ్యప్రేమ ఉండేది. అందువల్లనే భగవానుడు ఆతని దగ్గర మనస్సులోని ఏ మాట దాచుకొనేవాడు కాదు. తనకు పరమప్రేమికులైన గోపికల కడకు సందేశాన్ని చేరవేయడానికి శ్రీకృష్ణభగవానుడు ఉద్ధవుణ్ణే సర్వ శ్రేష్ఠునిగా ఎంచుకొంటాడు. ఆ సందర్భాన్ని వర్ణిస్తూ శ్రీశుకుడిలా అంటాడు –

**వృష్ణీనాం ప్రవరో మంత్రీ కృష్ణస్య దయితః సఖా।**
**శిష్యో బృహస్పతేః సాక్షాదుద్ధవో బుద్ధిసత్తమః॥**
**తమాహ భగవాన్ ప్రేష్ఠం భక్తమేకాన్తినం క్వచిత్।**
**గృహీత్వా పాణినా పాణిం ప్రపన్నార్తిహరో హరిః॥**

**గచ్ఛోద్ధవ వ్రజం సౌమ్య పిత్రోర్నౌ ప్రీతిమావహ।**
**గోపీనాం మద్వియోగాధిం మత్సందేశైర్విమోచయ॥**

(శ్రీమద్భా: 10:46:1–3)

"యదువంశీయులకు మంత్రివర్యుడు, సాక్షాత్తు బృహస్పతుల వారికి శిష్యుడు, అత్యంత బుద్ధిమంతుడు అయిన ఉద్ధవుడు శ్రీకృష్ణునికి ప్రియాతి ప్రియమైన స్నేహితునిగా ఉండేవాడు. శరణాగతులైన వారి దుఃఖాలను దూరం చేసే శ్రీకృష్ణ భగవానుడు ఓ రోజున అత్యంత ప్రియమైన ఆ అనన్యభక్తుని చేతులు పట్టుకొని ఆయనతో ఇలా అన్నాడు –" "ప్రియతమా! ఉద్ధవా! నీవు బృందావనమునకు వెళ్ళి నా తల్లిదండ్రులను ప్రసన్నులను చేయుము. అలాగే నా సందేశాల ద్వారా గోపకాంతలను ఎడబాటు అనే రోగం నుండి విముక్తులను చేయుము."

అర్జునుని సఖాభావాన్నైతే పరమాత్ముడే స్వయంగా ప్రకటించినాడు.–

**"భక్తోఽసి మే సఖా చేతి"**- నువ్వు నా భక్తుడివి, సఖుడివి.

(గీతా: 4:3)

**"ఇష్టోఽసి మే దృఢమితి"**- నీవు నాకత్యంత ప్రియుడవు.(గీతా: 18:64)

అశ్వత్థామ వల్ల ఉత్తర గర్భస్థశిశువు అయిన పరీక్షిత్తు మరణాన్ని తెలుసుకొని శ్రీకృష్ణుడు ఇలా అంటాడు –

"నాకు తెలిసినంతలో అర్జునునకు మిత్రత్వంలో ఎన్నడేని, ఎట్టి బాధను రానివ్వలేదన్నది సత్యమైన యెడల మరణించిన బాలకుడు జీవించి లేచునుగాక!"

**యథాహం నాభిజానామి విజయేన కదాచన।**
**విరోధం తేన సత్యేన మృతో జీవత్వయం శిశుః॥**

(మహా: అశ్వమేధ: 69:21)

మిత్రుని సుదామునిని చూసి శ్రీకృష్ణభగవానుడు ప్రేమ విహ్వలుడై, ఏవిధంగా ఆతనిని ఆదరించాడోనని చెప్పే సందర్భంలో శ్రీ శుకుడు ఇలా అంటాడు –

సఖ్యుః ప్రియస్య విప్రర్షేరంగసంగాతినిర్వృతః।
ప్రీతో వ్యముంచ దబ్బిన్దూన్ నేత్రాభ్యాం పుష్కరేక్షణః॥
అథోపవేశ్య పర్యంకే స్వయం సఖ్యుః సమర్హణమ్।
ఉపహృత్యావనిజ్యాస్య పాదౌ పాదావనేజనీః॥
అగ్రహీచ్ఛిరసా రాజన్ భగవాంల్లోకపావనః।
వ్యలింపద్ దివ్యగంధేన చందనాగురుకుంకుమైః॥
(శ్రీమద్భా: 10:80:19–21)

"కమలాక్షుడు శ్రీకృష్ణుడు తన ప్రియసఖుడు, బ్రహ్మర్షి అయిన సుదాముని శరీరస్పర్శతో అత్యంత ఆనంద భరితుడయ్యాడు. ఆయన నేత్రాలనుండి ఆనందాశ్రువులు ధారలయ్యాయి. అటు తర్వాత సుదాముని శయ్యాలంకృతుని చేసి శ్రీకృష్ణభగవానుడు స్వయంగా తన చేతులతో పాదాలు కడిగి పూజలు చేశాడు. లోక పావనుడగు భగవానుడు ఆ పాదోదకాన్ని శిరస్సున చల్లుకొన్నాడు. ఇంకా ఆయన శరీరానికి దివ్య గంధాన్ని, చందనాన్ని, అగరును పూసి కుంకుమాదులు దిద్దాడు."

భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రులైన ఈ స్నేహితులమాట అలా ఉంచితే నిషాద రాజు గుహుడు కూడా భగవంతునితో మైత్రిని నెరపి సంసార సాగరం నుండి తరించాడు.

కాబట్టి "భగవంతుడొక్కడే మనకు అత్యంత ప్రీతిపాత్రుడైనవాడు" అని తలచి, "మనసర్వస్వం ఆయనయే" అని భావించి మిక్కిలి ప్రేమతో సఖ్యభక్తిని సాధించుకోవాలి.

# ఆత్మనివేదనం

వాసుదేవాశ్రయో మర్త్యో వాసుదేవపరాయణః।
సర్వపాపవిశుద్ధాత్మా యాతి బ్రహ్మ సనాతనమ్॥ (విష్ణు.సహ. 130)

"వాసుదేవ భగవానుని ఆశ్రయించిన, ఆయనయందే పరాయణుడైన, మానవుని అంతఃకరణము అన్నివిధాలా పరిశుద్ధమవుతుంది. అంతేకాకుండా అతడు సనాతన బ్రహ్మను కూడా చేరగలడు."

పరమాత్మ యొక్క తత్త్వ, రహస్య, ప్రభావ, మాహాత్మ్యాలను తెలుసుకొని మమత, అహంకారాది రహితులై తమ తనువు, మనస్సు, ధనము, పరిజన సహితంగా తమను తాము సర్వకర్మలయందు శ్రద్ధాపూర్వకంగా అత్యంత ప్రేమ పూర్వకంగా భగవంతునికి సమర్పణ చేసుకోవడమే ఆత్మనివేదన భక్తిగా చెప్పవచ్చును.

మేలైనా, కీడైనా, జయమైనా, అపజయమైనా, కీర్తైనా, అపకీర్తైనా, సమ్మానమైన, అవమానమైనా, సుఖమైనా, దుఃఖమైనా, వీటన్నిటిని పొందేటప్పుడు అవిభగవంతుడు పంపిన కానుకలుగా తలచి సంతోషించడం, తనువునందు, ధనమునందు, స్త్రీ పుత్రాదులయందు మమతాహంకార రహితులవటం, భగవానుడు ఒక వాద్య కారుడైతే, ఆయన చేతిలో నేనొక వాయిద్యాన్ని అని నిశ్చయించుకొని ఆయన చేతిలోని కీలుబొమ్మలాగా, ఆయన ఇచ్ఛానుసారమే అన్నీ నిర్వర్తించడం, భగవంతుని రహస్య, ప్రభావాలను తెలుసుకోవడం కోసం ఆయన నామ రూప, గుణ, లీలాదులను వినడం, మననం చేయడం, కథనం, అధ్యయనం, చింతనాదులలో శ్రద్ధాపూర్వకంగా, భక్తి పూర్వకంగా తనువును, మనస్సును లగ్నం చేయడం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి మొదలైన వాటన్నింటి యందు భగవంతునికి మాత్రమే అధికారమున్నట్లు భావించడం, పరమాత్ముని వస్తువులు పరమాత్మునికే అర్పణ చేయబడుతున్నాయనే భావన కలిగి ఉండటం, ఏదో విధంగా భగవత్సేవచేస్తూ అందులోనే ఆనందం ఉన్నదని భావించడం, సర్వస్వాన్ని స్వామికే అర్పణ చేసి కోరికల్ని, అభిరుచుల్ని, విలాసాలను, విశ్రాంతిని, భోగాలను తొలగించుకోవడం (లేకుండా చేసుకోవడం) అంతటా, అన్నివేళలా, అన్ని విధాలా, ఆ పరమాత్మ అనుభూతినే పొందటం, భగవదిచ్ఛ మినహా స్వతంత్రమైన కోరిక లేవీ లేకుండా ఉండటం, భగవంతునిపై విశ్వాసముంచి సదా నిర్భయంగా, నిశ్చింతగా, ఆనందంగా ఉండటం, భగవద్భక్తి తప్ప మోక్షాన్ని కూడా వాంఛించకుండా ఉండటం వంటి వన్నీ 'ఆత్మనివేదన భక్తి'లోని పద్ధతులు.

భగవంతునియందు సాటిలేని ప్రేమను పొందటానికి భగవంతుని చేరుకోవడానికి (పొందటానికి) ఈ ఆత్మనివేదనభక్తి నిర్వర్తించబడుతోంది.

భగవంతుని శరణాగతి పొందిన ప్రియ భక్తులతో సాంగత్యము చేయడం, వారికి పరిచర్యలు చేయడం, వారి ద్వారా భగవంతుని నామ, రూప, గుణ, ప్రభావ, తత్త్వ మాహాత్మ్యాలను వినడం ద్వారా, వాటిని మననం చేయడం ద్వారా ఈ 'ఆత్మనివేదన భక్తి'ని సాధించవచ్చును.

పరమాత్ముడు స్వయంగా ఈ ఆత్మనివేదన రూపమైన శరణాగత భక్తి మాహాత్మ్యాన్ని ప్రకటిస్తూ దీని పరమఫలాన్ని గురించి భగవద్గీతలో విశేషంగా పేర్కొన్నాడు.

**దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా।**
**మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే॥** (7:14)

**మాం హి పార్థ! వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః।**
**స్త్రియో వైశ్యాస్తథా శూద్రాః తేఽపి యాంతి పరాం గతిమ్॥** (9:32)

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు।**
**మామేవైష్యసి యుక్త్వైవం ఆత్మానం మత్పరాయణః॥** (9:34)

**తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత।**
**తత్ప్రసాదాత్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్॥** (18:62)

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః॥** (18:66)

"ఏలయన ఈ అలౌకికమైన అనగా అత్యద్భుత త్రిగుణస్వరూపమైన నా మాయ అతి దుస్తరమైనది. అయితే కేవలం నన్నే భజించేవారు అనగా నన్నే ఆశ్రయించిన వారు ఈ మాయను అతిక్రమించెదరు. అనగా ఈ సంసార సాగరాన్ని తరించెదరు."

"హే అర్జునా! నన్ను ఆశ్రయించిన వాళ్ళు ఎవరైనా సరే, వారు పాపజన్ములు గాని, స్త్రీలుగాని, వైశ్యులుగాని, శూద్రులుగాని పరమగతినే పొందుతారు."

"కేవలం సచ్చిదానందఘన వాసుదేవ పరమాత్ముడైన నాయందే అనన్యప్రేమతో నిత్యనిరంతరంగా, అచంచలమైన మనస్సును నిలుపుము. పరమేశ్వరుడనైన నన్ను శ్రద్ధాపూర్వకంగా, ప్రేమ పూర్వకంగా, నిష్కామభావంతో, నామ, గుణ, ప్రభావాలను శ్రవణ, కీర్తన, మనన, పఠన పాఠనాదుల ద్వారా నిరంతరం భజించే వాడవు కమ్ము. మనో వాక్కాయ కర్మల ద్వారా సర్వస్వాన్ని అర్పణచేసి మిక్కిలి శ్రద్ధ, భక్తి ప్రేమలతో విహ్వలతా పూర్వకంగా నన్ను పూజించే వాడవుకమ్ము. సర్వశక్తిమంతుడను, విభూతి, బల, ఐశ్వర్య, మాధుర్య, గాంభీర్య, ఉదార, వాత్సల్య సహృదయాది గుణసంపన్నుడను, సర్వులకు ఆశ్రయుడను, వాసుదేవుడను అయిన నాకు వినయ పూర్వకంగా, భక్తి సహితంగా సాష్టాంగ ప్రణామం చేయుము. ఈ విధంగా నన్ను ఆశ్రయించి నా మీదనే మనస్సు నిలిపితే నీవు నన్నే పొందెదవు."

"ఓ అర్జునా! నీవు అన్ని విధాల ఆ పరమేశ్వరునే శరణు వేడుము. ఆయన దయవల్ల నీవు పరమశాంతినీ, సనాతన పరమధామాన్ని పొందెదవు."

"సర్వధర్మాలను అనగా సకల కర్తవ్యకర్మలను, నాయందే త్యజించి నీవు కేవలము సర్వశక్తి మంతుడను, సర్వాధారుడను, పరమేశ్వరుడను అయిన నన్నే ఆశ్రయించుము. నిన్ను సర్వపాపాలనుండి విముక్తుడను చేసెదను. నీవు విచారించకుము."

ఈవిధంగా భగవంతునికి ఆత్మనివేదన చేసుకొన్న మానవునికి సకల అవగుణాలు, పాపాలు, దుఃఖాలు సమూలంగా తొలగిపోతాయి. అంతేకాకుండా ఆతనిలో శ్రవణకీర్తనాది సకల విధములయిన భక్తులూ వృద్ధిపొందుతాయి. ఆతని ఆనందానికి, శాంతికి అవధులే ఉండవు. భగవంతుడు కూడా అతణ్ణి విడిచి ఉండలేడు. భగవంతుని సర్వస్వమూ అతనిదే అవుతుంది. ఇంకా అతడు పరమపవిత్రుడై, ఆతని దర్శన, భాషణ, చింతనాదులవల్ల పాపాత్ములు సైతం పవిత్రులవుతారు. అతడు తీర్థాలకోసం తీర్థస్వరూపుడవుతాడు. పరీక్షిన్మహారాజు శుకదేవునితో ఇలా అంటాడు –

**సాన్నిధ్యాత్తే మహాయోగిన్ పాతకాని మహాన్త్యపి।**
**సద్యో నశ్యంతి వై పుంసాం విష్ణోరివ సురేతరాః॥**

(శ్రీమద్భా: 1:19:34)

"మహాయోగి పుంగవుడవైన శుకదేవా! విష్ణుభగవానుని సాన్నిధ్య మాత్రం చేతనే దానవుల నాశనం జరిగినట్లు తమ (శుకదేవ) సాన్నిధ్యమాత్రం చేత మహామహా పాపజాలమంతా పటాపంచలగుతుంది."

ధర్మరాజు యుధిష్ఠరుడు విదురునితో ఇలా అంటాడు -

**భవద్విధా భాగవతాస్తీర్థ భూతాః స్వయం విభో।**
**తీర్థీ కుర్వన్తి తీర్థాని స్వాంతః స్థేన గదాభృతా॥** (శ్రీమద్భా: 1:13:10)

"భగవన్! మీ వంటి భగవద్భక్తులు స్వయంగా తీర్థస్వరూపులు, వారు తమ హృదయస్థిత భగవానుని ద్వారా తీర్థాలను తీర్థంగా చేస్తారు."

ప్రచేతస్సులు భగవంతుని స్తుతిస్తూ ఇలా అంటారు -

**తేషాం విచరతాం పద్భ్యాం తీర్థానాం పావనేచ్ఛయా।**
**భీతస్య కిం న రోచేత తావకానాం సమాగమః॥**(శ్రీమద్భా: 4:30:37)

"ఆహా! నీ భక్తులు తీర్థాలను పరమపవిత్రం చేయడం కోసం, భూమండలం మీద విహరిస్తూండగా, ఈ సంసారం చేత భయభీతులైన ఏ మనుష్యులకు నీ భక్తుల సమాగమం రుచించకుండా ఉంటుంది."

శ్రీ శుకదేవ మహారాజు భగవంతుని స్తుతిస్తూ ఇలా అంటాడు -

**కిరాతహూణాన్ధ్రపులిన్దపుల్కసా**
**ఆభీరకంకా యవనాః ఖసాదయః।**
**యేఽన్యే చ పాపా యదుపాశ్రయాశ్రయాః**
**శుద్ధ్యన్తి తస్మై ప్రభవిష్ణవే నమః॥** (శ్రీమద్భా: 2:4:18)

"ఏ భగవానుని ఆశ్రయించిన భక్తుల నాశ్రయించి, కిరాతుడు, హూణుడు, ఆన్ధ్రి, బోయ, కసాయి, గొల్ల, కంక, యవన, ఖసాదులు, అనేకమంది

పాపాత్ములు సైతం పవిత్రులయ్యారో, అట్టి భగవానునికి ప్రణామాలు."

భగవంతుని ప్రేమను మూర్తీభవించుకొన్నటువంటి భక్తులను నిఖిల ప్రపంచమూ, పరమప్రేమమయంగా, పరమానంద భరితంగా తెలుసుకొంటూనే ఉంటుంది. వారు వెళ్ళిన మార్గంలోనే శ్రద్ధ, ప్రేమ, భక్తి, ఆనందము, సమత, శాంతి మొదలైన వాటి ప్రవాహం నడుస్తూనే ఉంటుంది. అటువంటి భక్తులను భూతలం మీద ధరించిన భూమాత ధన్యమవుతుంది. సనాథ అవుతుంది. పితృదేవతలు హర్షిస్తారు. దేవతలు నర్తిస్తారు.

**మోదన్తే పితరో నృత్యన్తి దేవతాః సనాథా చేయం భూర్భవతి।**

(నారదభక్తి సూత్రాలు: 71)

గోపకాంతలు, బలిచక్రవర్తి మొదలైనవారు ఈ ఆత్మనివేదన భక్తి యందు పేర్కొనదగిన పరమభక్తులు.

కాబట్టి మానవ మాత్రులమైన మనం నడుంబిగించి మనోవాక్కాయకర్మల ద్వారా అన్నివిధాలా ఆ భగవానుని ఆశ్రయించటానికి కృషి చెయ్యాలి.

# ఉపసంహారం

భగవంతుణ్ణి పొందటానికి కర్మ, యోగ, జ్ఞాన మార్గాలన్నీ ఉత్తమమైనవే. అయితే భక్తి గురించి మాత్రం శాస్త్రాలలో ప్రముఖంగా పేర్కొనబడింది. నవవిధభక్తులలో ఏ ఒక్క భక్తి ఉన్నా, ఆ భక్తుడు సంసార సాగరాన్ని అనాయాసంగా దాటి భగవంతుణ్ణి పొందగలడు. అలాంటప్పుడు ప్రహ్లాదుని లాగా నవ విధభక్తులు వృద్ధి పొందిన వాని విషయం వేరే చెప్ప నక్కరలేదు గదా! నవవిధ భక్తుల గురించి వివరించేటప్పుడు ఉదాహరించిన భక్తుల పేర్లనుబట్టి వారిలో ఒకే భక్తి వృద్ధి చెంది ఉన్నట్లు భావించరాదు. ఎవరెవరిలో ఏ భక్తి భావము ప్రాధాన్యతను పొంది ఉన్నదో, దానిని బట్టే పేర్లు ఉటంకించడం జరిగింది. రెండోసారి వారి పేరు రాకుండా ఉండే ఉద్దేశంతో అలా పేర్కొనడం జరిగింది. నిజానికి భగవంతుని భక్తిలో తమ

మనస్సు లగ్నం చేసిన వారు ధన్యులు. అలాగే భగవద్భక్తులుద్భవించిన వారి వంశం కూడా ధన్యమే! శివుడు పార్వతితో ఇలా అంటాడు –

సో కుల ధన్య ఉమా సును జగత పూజ్య సుపునీత్।
శ్రీరఘుబీర పరాయన జేహిఁనర ఉపజ బినీత్॥

శ్రీమద్భాగవతంలో శ్రవణాది భక్తులను గురించి ఇలా వర్ణింపబడింది–

శృణ్వన్తి గాయన్తి గృణన్త్యభీక్ష్ణశః
స్మరన్తి నన్దన్తి తవేహితం జనాః।
త ఏవ పశ్యన్త్యచిరేణ తావకం
భవప్రవాహోపరమం పదాంబుజమ్॥ (1:8:36)

యత్కీర్తనం యత్స్మరణం యదీక్షణం
యద్వన్దనం యచ్ఛ్రవణం యదర్హణమ్।
లోకస్య సద్యో విధునోతి కల్మషం
తస్మై సుభద్రశ్రవసే నమోనమః॥ (2:4:15)

"పదే పదే నీ చరిత్రను వింటూ, గానం చేస్తూ, వర్ణిస్తూ, స్మరించుకొంటూ ఆనందభరితులయ్యే వాళ్ళే (భక్తులే) శీఘ్రాతిశీఘ్రంగా ఈ సంసార (సాగర) ప్రవాహాన్ని శాంతపరిచే నీ చరణకమలాల దర్శనాన్ని పొందుతారు.–"

"ఎవని కీర్తనం, స్మరణం, దర్శనం, వందనం, శ్రవణం ఇంకా పూజనం మానవుల సకల పాపాలను సత్వరం కడిగి వేస్తాయో, ఆ కల్యాణదాయకుడు, కీర్తిశాలియైన భగవంతునికి పదేపదే ప్రణామాలు"

దేవేంద్రుడు ఇలా అంటాడు –

యస్య భక్తిర్భగవతి హరౌ నిశ్శ్రేయసేశ్వరే।
విక్రీడతోఽమృతాంభోధౌ కిం క్షుద్రైః ఖాతకోదకైః॥

(శ్రీమద్భా: 6:12:22)

"పరమ కల్యాణ మయుడైన శ్రీకృష్ణ భగవానుని యందు, ప్రేమగల వారు అమృతాంబుధిలో క్రీడిస్తూంటారు. అలాంటప్పుడు వారికి తుచ్ఛ విషయరూపమైన గుంటనీటివల్ల ఏం ప్రయోజనం ఉంటుంది?"

భగవానుడు స్వయంగా తన ఉద్ధారక భక్తిని శ్లాఘిస్తూ ఉద్ధవునితో ఇలా అంటాడు –

**న సాధయతి మాం యోగో న సాంఖ్యం ధర్మ ఉద్ధవ।**
**న స్వాధ్యాయస్తపస్త్యాగో యథా భక్తిర్మమోర్జితా॥**
**భక్త్యాహమేకయా గ్రాహ్యః శ్రద్ధయాఽఽత్మా ప్రియః సతామ్।**
**భక్తిః పునాతి మన్నిష్ఠా శ్వపాకానపి సంభవాత్॥**
**ధర్మః సత్యదయోపేతో విద్యా వా తపసాన్వితా।**
**మద్భక్త్యాపేతమాత్మానం న సమ్యక్ ప్రపునాతి హి॥**

**వాగ్గద్గదా ద్రవతే యస్య చిత్తం**
**రుదత్యభీక్ష్ణం హసతి క్వచిచ్చ।**
**విలజ్జ ఉద్గాయతి నృత్యతే చ**
**మద్భక్తియుక్తో భువనం పునాతి॥**

(శ్రీమద్భా: 11:14:20–22, 24)

"హే ఉద్ధవా! అనన్యభక్తితో నేను ప్రసన్నుడనైనట్లుగా యోగ, సాంఖ్య, ధర్మ, స్వాధ్యాయ, తపస్త్యాగాదులతో ప్రసన్నుడనుకాను. సత్పురుషులకు పరమప్రియుడను, ఆత్మరూపుడనైన నేను ఏకైక శ్రద్ధాభక్తి తోడనే ప్రసన్నుడనవుతాను. నా భక్తి జన్మతః చండాలురగు వారిని సైతము పవిత్రులను చేస్తుంది. నాయందు భక్తి రహితులైన జీవులను సత్యము, దయాది యుక్తధర్మాలు, ఇంకా తపోమయవిద్యలు కూడా పరిపూర్ణంగా పవిత్రం చేయజాలవు." –

–"ఎవని వాణి నా నామ, గుణ, లీలాదులను వర్ణిస్తూ వర్ణిస్తూ, గద్గదమవుతుందో, ఎవనిచిత్తము నా రూప, గుణ, ప్రభావ, లీలాదులను స్మరిస్తూ స్మరిస్తూ ఆర్ద్రమవుతుందో, ఎవడు పదే పదే రోదిస్తూ అప్పుడప్పుడు

నవ్వనారంభిస్తాడో, ఇంకా ఎవడు లజ్జను విడిచి పెట్టి ప్రేమ నిండినవాడై, పిచ్చివానిలా ఉచ్చైస్స్వరంలో గానం చేస్తూ నాట్యంలో మునిగి పోతాడో అటువంటి నా భక్తుడు ఈ ప్రపంచాన్ని పునీతం చేస్తాడు."

భగవానుడు గీతలో అర్జునితో ఇలా అంటాడు -

**నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా।**
**శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా॥**
**భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున।**
**జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప॥** (11:53–54)

"నీకు కలిగిన నా చతుర్భుజరూప సందర్శనము (విశ్వరూప సందర్శనము) వేదాలవల్లగాని, తపస్సులవల్లగాని, దానాదులవల్ల గాని, యజ్ఞాల వల్లగాని లభించదు. (ఆ రూపమున చూచుటకు శక్యము కాని వాడను). కాని పరంతపా! అర్జునా! అనన్యభక్తి ద్వారా ఈ విధంగా చతుర్భుజ రూపుడనైన నన్ను ప్రత్యక్షంగా దర్శించటానికి, తత్త్వముచే యథార్థాన్ని తెలుసుకోవడానికి, ఇంకా నాలో ప్రవేశించి ఐక్యమవటానికి సాధ్యమైనవాడను."

భక్తుడైన శ్రీకాకభుశుండి ఇలా అంటాడు -

**రామ భగతి చింతామని సుందర। బసఇ గరుడ జాకే ఉర అంతర్॥**
**పరమ ప్రకాస రూప దిన రాతీ। నహి కఛు చహిఅ దిఆ ఘృత బాతీ॥**
**మోహ దరిద్ర నికట నహిఁ ఆవా। లోభ బాత నహిఁ తాహి బుఝావా॥**
**ప్రబల అబిద్యా తమ మిటిజాఈ। హారహిఁ సకల సలభ సముదాఈ॥**
**ఖల కామాది నికట నహిఁ జాహీఁ। బసఇ భగతి జాకే ఉర మాహీఁ॥**
**గరల సుధాసమ అరిహిత హోఈ। తేహిమని బినుసుఖ పావ నకోఈ॥**
**బ్యాపహిఁ మానస రోగన భారీ। జిన్హ కే బస సబ జీవ దుఖారీ॥**
**రామ భగతిమని ఉరబస జాకేఁ। దుఖలవలేస న సపనేహుఁ తాకేఁ।**
**చతుర సిరోమని తేఇ జగ మాహీఁ। జేమని లాగి సుజతన కరాహీఁ॥**

"ఓ గరుత్మంతా! శ్రీరామభక్తి అందమైన చింతామణివంటిది. ఇది నెలకొనిన వాని హృదయములో దివారాత్రములు (తనంతతానుగా) మిక్కిలి

ప్రకాశిస్తుంటుంది. దీనికి దీపము, నెయ్యి, వత్తి ఏదీ అక్కరలేదు. ఈ మణి సహజంగానే ప్రకాశిస్తుంది. ఇక మోహమనెడు దారిద్ర్యము దాని చెంత కేరాదు. లోభమనెడు గాలి ఆ మణిమయదీపజ్వాలను ఆర్పివేయజాలదు. దాని ప్రకాశంతో అవిద్యతో కూడిన దట్టమైన చీకట్లు నశించిపోవును. మద, మాత్సర్యాది మిడతల సమూహము ఓడి పోవును. ఎవని ఎడదలో భక్తి వసించునో, కామ, క్రోధ, లోభాది దుష్టులు వానిదరి జేరలేరు. అతనికి విషము, అమృతముగను, శత్రువు, మిత్రునిగను మారిపోవును. ఆ మణిలేకుండా ఎలాంటి సౌఖ్యమును పొందదు. గొప్ప-గొప్ప మానసిక రోగముల బారిన పడిన జీవులందరు బాధలనుభవించుచున్నట్లుగా, ఈ మణి కలిగిన వారిని అవి అంటవు. శ్రీరామభక్తి యనెడు మణిని హృదయమందు కలిగిన వానికి లేశమాత్రమైన దుఃఖము కలలోనైన కలుగబోదు. కావున ఇటువంటి భక్తి రూపమగు మణి కొరకై బాగుగా ప్రయత్నించు మనుజుడే ఈ జగత్తు నందు చతుర శిరోమణి యనబడును."

కాబట్టి మానవులందరూ ఉపర్యుక్త పద్ధతులన్నిటి ద్వారా భగవద్భక్తిని ఆశ్రయించి తమ జీవితాన్ని, జన్మను సఫలం చేసుకో వలయును.

॥ హరిః ఓం తత్సత్ ॥

* * *